● 157 దేశాల నోట్లు ● పదేళ్లలో 200 కోట్లు

# శ్రీవారి హుండీలో విదేశీ కరెన్సీ






తృణమో పణమో అయినా స్వామికి హుండీలో సమర్పించుకోకుండా తిరుమల కొండకు వచ్చిన భక్తులెవరూ తిరుగు ప్రయాణం కారు. అట్లా శ్రీనివాసుడికి నగదూ, నాణేలూ, ఆభరణాలతో పాటు భూములు, భవనాల పత్రాలు కూడా హుండీ ద్వారా లభిస్తుంటాయి. హుండీ అనేది డబ్బు సేకరణకు సాధనం కాదు. భక్తికి ప్రతీక. దేశదేశాల నుంచి వచ్చే భక్తులు తమ దేశాల కరెన్సీనీ, నాణేలనూ హుండీలో వేస్తుంటారు. ప్రపంచంలో 197 దేశాలుంటే 157 దేశాల కరెన్సీ శ్రీవారి హుండీలో లభించింది. 2015 నుంచి 2025 మార్చి వరకు ఉన్న రికార్డుల ఆధారంగా చూస్తే రూ.201,65,97,829 విదేశీ కాయిన్స్, నోట్లు అందాయి. గడిచిన పదేళ్లలో ఏడాదికి సగటున రూ.20.16 కోట్లు విదేశీ సొమ్ములు స్వామి ఖజానాకు అందుతున్నాయి. విదేశీ కరెన్సీని వేలం ద్వారా మనీ చేంజర్స్‌కి అందజేసి స్వదేశీ కరెన్సీగా టీటీడీ మార్చుకుంటుంది. 2003 వరకు బరువు ప్రాదిపదికన నాణేల విక్రయం జరిగేది. ఆ తర్వాత వాటి విలువ ఆధారంగా మార్పిడి జరుగుతోంది. ఎఫ్‌సీఆర్ఏ మార్గదర్శకాల ప్రకారం తిరుమల ఎస్‌బీఐ బ్రాంచ్ నుంచి న్యూఢిల్లీలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో విదేశీ కరెన్సీని, నాణేలనూ జమ చేస్తున్నారు.

రెండేళ్ల కిందట టీటీడీ ఎఫ్‌సీఆర్ఏ(ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) నిబంధనలను ఉల్లంఘించిందనే వివాదం కూడా నడిచింది. విరాళాలు ఇచ్చే దాతల వివరాలు తెలియజేయడం లేదనే రిపోర్టు ఆధారంగా టీటీడీకి జరిమానా కూడా విధించారు. అయితే హుండీలో సమర్పించే కానుకలు కావడంతో ఈ విరాళాలను 'శ్రీవారికి సమర్పించే కానుకలు'గా పరిగణిస్తూ దాతల వివరాలను తెలియజేయాల్సిన అవసరం లేదంటూ యాక్ట్ నుంచి మినహాయింపు లభించింది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

- 2007 వరకు కూడా కేవలం 15 నుంచి 30లోపు దేశాలకు సంబంధించిన కరెన్సీ మాత్రమే పరకామణి లెక్కింపులో కనిపించేది. ఆ తర్వాతే ఇతర దేశాలకు సంబంధించి కాయిన్స్‌తో పాటు నోట్లు అధికంగా రావడం మొదలయ్యాయి. 2010 వరకు ఉన్న లెక్కలను పరిశీలిస్తే సింగపూర్, అమెరికా డాలర్లు, యూరో సెంట్లు, బ్రిటిష్ పౌండ్లు, మలేషియా, ఆస్ట్రేలియా, కెనడా, దక్షిణాఫ్రికా, శ్రీలంక దేశాల నగదు అధికంగా ఉండేవి. ఆ తర్వాత అనేక దేశాలకు సంబంధించిన కరెన్సీ కానుకలుగా రావడం పెరిగిపోయింది. అమెరికా, మలేషియా, సింగపూర్‌తో పాటు యూఏఈ దేశాల కరెన్సీ అధికంగా ఉంటోంది.
- స్వామి హుండీలో పాకిస్తాన్ కరెన్సీ కూడా కనిపిస్తూ ఉంటుంది.
- 2004లో 10 టన్నుల విదేశీ నాణేలను టీటీడీ విక్రయించి దాదాపు రూ.కోటి ఆదాయాన్ని పొందింది. అందులో 80 వేల సింగపూర్ డాలర్లు, 1.6 లక్షల అమెరికన్ డాలర్లు, 3 వేల యూరో సెంట్లు, 35 వేల బ్రిటిష్ పౌండ్లు, 8 లక్షల మలేషియన్ రింగెట్లు, 4 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు, వెయ్యి దక్షిణాఫ్రికా రాండ్లు, 15వేల కెనిడియన్ సెంట్లు, 10 వేల లంకన్ రూపాయలు ఉన్నాయి.
- 2007 డిసెంబరు నెల చివరి వారంలో ఆరు రోజుల్లో దాదాపు 14 దేశాలకు చెందిన కరెన్సీ హుండీలో చేరింది.
- 2016లో హుండీ ద్వారా విదేశీ కరెన్సీ 50.63 కోట్లు లభించింది.
- 2015లో రూ.44.81 కోట్లు ఇతర దేశాల కరెన్సీ లభించింది.
- 2020-21 కరోనా సమయంలోనూ స్వామి హుండీలో రూ.1.92 కోట్లు ఇతర దేశాల నగదు చేరడం విశేషం.





## శోభాయమానంగా తిరుమల కొండ

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలతో తిరుమల కొండ శోభాయమానంగా దర్శనమిస్తోంది. రూ.5.50 కోట్లతో విద్యుద్దీపాలంకరణ చేపట్టడంతో నూతన అందాలతో స్వామి క్షేత్రం కనువిందు చేస్తోంది. శ్రీవారి గర్భాలయం నుంచి మహద్వారం వరకు, ప్రాకారం, గోపురం, మాడవీధుల్లోని ముఖ్యమైన భవనాలకు రంగురంగు లైట్లతో విద్యుత్ అలంకరణలు చేశారు. ప్రధాన కూడళ్లలోనూ విద్యుత్ తీగలతో పాటు వివిధ దేవతామూర్తుల భారీ కటౌట్లు, లైట్లతో కూడిన ప్లాస్టిక్ చెట్లు, సప్తద్వారాలు ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితా విడుదల

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఎస్వీ వైద్య కళాశాల, రుయాస్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రుయాస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్, శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల పరిధిలో పోస్టుల భర్తీకి సంబంధించి గతంలో విడుదల చేసిన కంబైన్డ్ నోటిఫికేషన్ తుది జాబితాను విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏవైనా అభ్యంతరాలుంటే ఈ నెల 26 సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని తెలిపారు.

# మళ్లీ తెరపైకి పరకామణి కుంభకోణం

● అప్పటి అధికారుల గుండెల్లో గుబులు ● సీఐడీ చేతికి పరకామణి దొంగతనం కేసు

తిరుమల, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కుంభకోణం మళ్లీ తెరపైకి వచ్చింది. లోక్‌అదాలత్‌లో రాజీ కుదిర్చిన కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ ఏపీ హైకోర్టు ఆదేశాలివ్వడంతో అప్పటి అధికారులు, పాలకుల గుండెల్లో గుబులు మొదలైంది.

### విజిలెన్స్ అధికారి ఫిర్యాదుతో వెలుగులోకి..

శ్రీవారి ఆలయంలోని హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించే పరకామణిలో టీటీడీ అధికారులు, సిబ్బందితోపాటు సేవకులు విధులు నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల నిఘాలోనే జరుగుతుంది. వీటిని ఎప్పటికప్పుడు విజిలెన్స్ అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ఈ లెక్కింపులో పెద్దజీయర్ మఠం నుంచి కూడా ఓ వ్యక్తి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. అయితే 2023 ఏప్రిల్ 29వ తేదీన సాయంత్రం 4 గంటల సమయంలో మఠం నుంచి వచ్చిన రవికుమార్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా వ్యవహరిస్తున్నాడని గుర్తించిన చంద్ర అనే సెక్యూరిటీ గార్డు అప్పటి విజిలెన్స్ ఏవీఎస్వో సతీష్‌కుమార్‌కు సమాచారమిచ్చాడు. దీంతో ఏవీఎస్వోతోపాటు వీఐ సుబ్బరాజు కలిసి రవికుమార్‌ను తనిఖీ చేయగా విదేశీ కరెన్సీని దాచినట్లు గుర్తించారు. 100 డాలర్ల తొమ్మిది నోట్లు(రూ.72 వేలు) ఉన్నట్టు గుర్తించారు. తాను 30 ఏళ్లుగా పెద్దజీయర్ మఠంలో పనిచేస్తున్నానని, గతంలో ఎప్పుడూ తాను ఇలాంటి తప్పులు చేయలేదని రవికుమార్ చెప్పుకొచ్చాడు. ఈ మేరకు నివేదికను తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమర్పించగా 379, 381 ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

### లోక్ అదాలత్ తీర్పుపై బ్రేక్

2023లో నమోదైన ఈ కేసుపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అనేక వ్యవస్థలు ఉన్న క్రమంలో తప్పుచేసిన వారికి శిక్ష వేయకుండా రాజీ కుదర్చడానికి వీరెవరు అంటూ పలు రాజకీయ పార్టీలు, హిందూ సంఘాలు, భక్తుల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి.దాదాపు రూ.200 కోట్లకుపైగా స్వామి సొమ్మును అపహరించిన వ్యక్తిని కేసు నుంచి తప్పించే అధికారం వీరికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఈ కేసుపై విచారణ చేపట్టాలంటూ బీజేపీ నేత, ప్రస్తుత బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కూడా 2024లో ధర్మకర్తల మండలికి ఫిర్యాదు కూడా చేశారు. అయితే తిరుపతికి చెందిన ఎం.శ్రీనివాసులు పరకామణి వ్యవహారంపై సీఐడీ ద్వారా విచారణ చేయించాలంటూ వేసిన పిటిషన్ ఆధారంగా శుక్రవారం కేసు విచారణకు వచ్చింది. కౌంటర్‌కు రెండు వారాల గడువు ఇస్తూ లోక్ అదాలత్‌లో ఇచ్చిన ఆదేశాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు తీర్పునిచ్చింది. ముఖ్యంగా కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి పరకామణి కుంభకోణం తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో అప్పటి పాలకులు, అధికారులు, సిబ్బంది గుండెల్లో గుబులు మొదలైనట్టు తెలుస్తోంది.మరోవైపు రాజకీయంగానూ ఈ వ్యవహారం వేడిని పుట్టిస్తోంది. విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి.

### పోలీస్ ఒత్తిడితో రాజీ

టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి 2024 జనవరిలో మండలిలో ఈ కేసు గురించి మాట్లాడుతూ పరకామణి నుంచి దాదాపు రూ.వంద కోట్లు దొంగతనం చేశారని, ఆయన్ను ఉద్దేశపూర్వకంగా కేసు నుంచి తప్పించారని వ్యాఖ్యానించడం తీవ్రస్థాయి చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులు ఈ వ్యవహారంపై మరోసారి విచారణ చేపట్టి 2024 జూలైలో నివేదిక సమర్పించారు. ఆ నివేదికలో 2023 మే 30వ తేదీన తిరుపతి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలా చేయబడిందని పేర్కొన్నారు. తిరుపతి, చెన్నైలో రవికుమార్‌తో పాటు అతని సతీమణి పేరుపై ఉన్న ఏడు ఆస్తులను టీటీడీ విరాళంగా ఇచ్చారని, వాటి రిజిస్ట్రేషన్ పత్రాలను టీటీడీకి అందజేశారని వింగ్ అధికారులు నివేదించారు. కాగా, 2023 సెప్టెంబరు 9వ తేదీన ఏవీఎస్వో సతీష్‌తో పాటు రవికుమార్ కలిసి రాజీకి వచ్చామని కోర్టుకు తెలిపారని, ఈ క్రమంలో ఈ కేసును లోక్‌అదాలత్ కొట్టివేసిందని, అందుకే రవికుమార్‌కు శిక్ష పడలేదని వింగ్ స్పష్టం చేసింది. అయితే అప్పటి పోలీసు అధికారుల ఒత్తిడితో ఈ రాజీ ఒప్పందం జరిగిందని, పోలీసులు ఎందుకు ఇలాంటి ఒత్తిడి తీసుకువచ్చారో తనకు తెలీదంటూ ఏవీఎస్వో సతీష్ కుమార్ రాతపూర్వకంగా ఇచ్చినట్టు విజిలెన్స్ వింగ్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఆస్తుల ధర దాదాపు రూ.40 కోట్లు ఉండవచ్చని అధికారుల అంచనా.

## స్విమ్స్‌లో అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సులకు మూడో విడత కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ పరిధిలోని శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్‌సైన్సెస్ కోర్సులకు సంబంధించి మిగిలిన సీట్లకు చివరిసారిగా మూడో విడత ఆఫ్‌లైన్ విధానం ద్వారా ఈ నెల 26న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరుకాలని వెల్లడించారు. ఈ సీట్లను ఏపీ ఎంసెట్-2025 ర్యాంకుల ఆధారంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు లోబడి భర్తీ చేస్తారని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26న ఉదయం 8.30 గంటలకు కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.



## స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు స్కోచ్ పురస్కారం

● అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లి ప్రాజెక్టులో భాగంగా 45 రోజుల్లో 1,600 ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసినందుకు అత్యంత ప్రతిష్టాత్మకమైన స్కోచ్ పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ కన్వెన్షన్‌లో శనివారం ఈ అవార్డును ఏపీఎస్పీడీసీఎల్ సీఈ సురేంద్రనాయుడితో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ అందుకున్నారు. గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో రూ.20.68కోట్లతో ఎ.రంగంపేట, కందులవారిపల్లి, చిన్నరామాపురం గ్రామ పంచాయతీల్లోని 1,600 గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జిల్లా యంత్రాంగం సహకారంతోనే ఇది సాధ్యమైందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్, స్వర్ణనారావారిపల్లి స్పెషల్ ఆఫీసర్ సుశీలాదేవి, ఇతర అధికారులు కలెక్టర్‌కు అభినందలు తెలిపారు.

## ఈ రోగానికి మందేది?

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు

8



## రేపటి నుంచి ఎల్లమ్మ నవరాత్రి వేడుకలు



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని,తదితరులు

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా శనివారం ఆలయ ఆవరణలో కొత్త పాలక మండలి సభ్యులు, అధికారులు, టీడీపీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేడుకలను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే నాని పాలకమండలి సభ్యులకు, అధికారులకు సూచించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉత్సవాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 22న కలశస్థాపనతో వేడుకలు మొదలవుతాయి. ఈనెల 24న సాయంత్రం పెద్దశేష వాహనంపై లక్ష్మీ అలంకరణలో, 25న గజవాహనంపై గజలక్ష్మి అలంకరణలో, 26న నందీ వాహనంపై అన్నపూర్ణదేవి అలంకరణలో, 27న గరుడ వాహనంపై నారాయణీ అలంకరణలో, 28న హంస వాహనంపె సరస్వతీదేవి అలంకరణలో, 29న అశ్వ వాహనంపైగాయత్రిదేవి అలంకరణలో, 30న సింహ వాహనంపై రాజరాజేశ్వరిదేవి అలంకరణలో, అక్టోబరు 1న పూలతేరుపై దుర్గాదేవి అలంకరణలో, 2న పుష్పపల్లకిలో మహిషాసుర మర్దిని అలంకరణలో ఎల్లమ్మ భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్, టీడీపీ సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తి, ఈవో మమత, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, డాక్టర్ వాసు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## అనుపల్లి మార్గంలో ప్రమాదకరంగా గుంతలు



సూరావారిపల్లి వద్ద ఏర్పడిన గుంత

రామచంద్రాపురం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనుపల్లి ఆర్అండ్‌బీ రహదారిలో గుంతలు ఏర్పడి పరీక్ష పెడుతున్నాయి. రాయలచెరువు కట్ట నుంచి అనుపల్లి వరకు 15 కిలోమీటర్ల దూరం ఉంది.ఈమార్గంలో సూరావారిపల్లి, తిమ్మరాజుపల్లె, నెత్తకుప్పం, వేపకుప్పం, బీరమాకులకండ్రిగ, నీటిగుంటపల్లెతోపాటు 70 గ్రామాలు ఉన్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఇదే రహదారి నుంచి వెదురుకుప్పం, పెనుమూరు మండలాలకు వెళుతుంటాయి. తిరుపతికి కూలీలు, చిన్నపాటి వ్యాపారులు, విద్యార్థులు తిరుపతికి వెళుతుంటారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈరోడ్డుపై పైసా ఖర్చు చేసిన దాఖలాలు లేవు. ఎమ్మెల్యే నాని బాధ్యతలు చేపట్టాక గుంతలు పూడ్చారు. వర్షాలు కురుస్తుండటంతో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. గుంత లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాకిమాను మునిరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ నేతృత్వంలో శిబిరం జరిగింది. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు హాజరయ్యారు. రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. పార్టీ నాయకులు ది జల్లి మధుసూదన్, వెంకటముని, సుబ్రమణ్యంయాదవ్, కాయం హరినాథ్‌రెడ్డి, శ్రీధర్ బాబు, జి సునీల్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వేలో లోపాలను సరిదిద్దుకోండి



అర్జీలు పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

భాకరాపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో తలెత్తిన లోపాలను రైతులు సరిదిద్దుకోవాలని తహసీల్దారు భాగ్యలక్ష్మి సూచించారు. భాకరాపేట రెవెన్యూ గ్రామంలో భూముల రీసర్వేపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విస్తీర్ణం, పేర్లలో తప్పులు ఉంటే రైతులు పరిశీలించుకుని రెవెన్యూ అధికారులకు అర్జీలు ఇవ్వాలన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి లోపాలను సవరిస్తామన్నారు. సర్వేయర్ గణేశ్, ఆర్ఐ జానకీరామ్, వీఆర్వో శివకుమార్, రీసర్వే డీటీ, సర్పంచ్ భూపాల్ పాల్గొన్నారు.

## ఇజ్తిమా ప్రార్థనల ప్రారంభం



సందేశమిస్తున్న మతపెద్దలు

పాకాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇరంగారిపల్లె పంచాయతీ ముద్దలపల్లె సమీపంలో శనివారం ఇజ్తిమా కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ముస్లిం మత పెద్దలు వచ్చి ఇస్లాం సందేశాన్ని వినిపించారు. మహమ్మద్ ప్రవక్త బోధనల మేరకు ఇతరులకు హాని తలపెట్టకూడదని, జమాత్‌కు వెళ్లాలని, సత్ప్రవర్తన మార్గాలను అనుసరించాలని సూచించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇజితిమ కార్యక్రమం ఆదివారం రాత్రి వరకు జరుగుతుంది. తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రం నుండి వచ్చిన మత పెద్దలు దైవసందేశమిస్తారు. ఆదివారం రాత్రి సామూహిక ప్రార్థనలకు భారీ ఏర్పాట్లు చేశారు.

## మొక్కలతో పచ్చదనం పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో సోమశేఖరరెడ్డి

భాకరాపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): చెట్లను నాటి పచ్చదనాన్ని పెంచుదామని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు చెట్లు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోపాటు పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ గిరిబాబు పాల్గొన్నారు.

## ఉస్తికాయలపెంట విద్యార్థుల క్రీడాప్రతిభ



జోనల్ స్థాయి క్రీడా పోటీలో గెలుపొందిన విద్యార్థులు

ఎర్రావారిపాలెం; సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : జోనల్ స్థాయి ఎంపిక క్రీడా పోటీల్లో బాలికల జూనియర్ ఖోఖో విభాగంలో ఉస్తికాయలపెంట విద్యార్థులు విజేతగా నిలిచారు. మండల కేంద్రంలో జరిగిన .100, 200 మీటర్ల పరుగు పోటీల్లో మహాలక్ష్మి, పుష్పరేఖ మొదటి స్థానాలు సాధించారు. 800,1500 మీటర్ల పరుగు పోటీల్లో జడ్పీహెచ్ స్కూలు విద్యార్థులు మొదటి స్థానాలు కైవసం చేసుకొన్నారు. లాంగ్ జంప్‌లో మదన, పుష్పరేఖ ప్రథమ ద్వితీయ స్థానాలు పొందారు.

# చంద్రగిరి

## విద్యార్థులకు యూనిఫాం వితరణ



పాకాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పూర్వ విద్యార్థులు యూనిఫాం అందజేశారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు వై.లింగయ్యానాయుడు, కోశాధికారి జీవిప్రసాద్‌లు 30 మందికి యూనిఫాం పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తవీధిలో కొలువైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో క్రన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకమండలి చైర్మన్ పామిడి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు మీడియాతో మాట్లాడారు. ఈ నెల 22నుంచి వచ్చేనెల 3వరకు దసరా ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పాలక మండలి సభ్యులు జి.కె.రాణి, కె.శ్రీధర్, హేమరాజ్, రవి చంద్రశేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, అధ్యాపకుల పారిశ్రామిక బాట..!



అమరరాజా బ్యాటరీస్‌లో ఫ్యాకల్టీ మెంబర్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు పారిశ్రామిక బాట పట్టారు. యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు రేణిగుంటలోని దక్షిణ మధ్య రైల్వే గ్యారేజ్‌ను సందర్శించారు. గ్యారేజ్ నిర్వహణ తీరును వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. వారం రోజులుగా పద్మావతి వర్సిటీలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ప్రతినిధులు అమరరాజా బ్యాటరీస్‌ను సందర్శించారు. ఈ క్షేత్ర పర్యటన ద్వారా వారు వివిధ అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

## అవాస్తవాలతో గందరగోళం సృష్టించడం తగదు

**●అదనపు ఈవో వెంకయ్య చౌదరి**

తిరుమల, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): భక్తులకు సరైన సమాచారం అందించే విషయంలో మీడియా పాత్ర కీలకమైనదని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. అన్నమయ్య భవనంలో శనివారం సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. అదనపు ఈవో మాట్లాడుతూ.. ఇటీవల కొందరు యూట్యూబర్లు అవాస్తవ, ఆధారరహిత వార్తలతో భక్తులను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు.దీనివల్లభక్తుల మనోభావాలను దెబ్బతినే అవకాశముందన్నారు. తిరుమలలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులకు ఇక్కడిఅభివృద్ధిపై, భక్తులకు టీటీడీ అందిస్తున్న విశేష సేవలపై ఎంతో అవకాగాహన ఉందన్నారు. అసత్య కథనాలతో దుష్ప్రచారం చేసే వారిని నియంత్రించేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలన్నారు. ఇటీవల చేపట్టిన సంస్కరణలను వివరించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోకి భక్తులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో లెక్కించేలా యంత్రాలను అమర్చబోతున్నామన్నారు. అశ్విని ఆస్పత్రి అభివృద్ధిపై కూడా దృష్టిసారించామన్నారు. ఇక, శ్రీవారి నైవేద్యాల తయారీకి వినియోగించే ముడిసరుకుల నాణ్యతను పెంచేలా ఉగ్రాణంలో నూతన యంత్రాన్ని కూడా ఇటీవల అమర్చామన్నారు. డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, సీపీఆర్వో రవి, వీఎస్వోలు రాంకుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో శరబయ్య యాదవ్ విగ్రహం, మఠం ఏర్పాటు చేయాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శరబయ్యయాదవ్ విగ్రహం, మఠం ఏర్పాటు చేయాలని అఖిలభారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హేమంత్‌కుమార్ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చైర్మన్‌గా నైనారు మహేస్‌యాదవ్‌ను నియమించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయరాంయాదవ్, రామచంద్రయాదవ్, అశోక్‌సామ్రాట్, భరణియాదవ్, రవిశంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి గొడుగులకు ఘన స్వాగతం

పుత్తూరు టౌన్/ నారాయణవనం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నై నుంచి గొడుగులతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు నారాయణవనం, పుత్తూరు పట్టణాల్లో ఘన స్వాగతం పలికారు. ఏటా చెన్నై నుంచి శ్రీవారికి సమర్పించేందుకు పాదయాత్రగా గొడుగులతో తిరుమలకు చేరుకోవడం ఆనవాయితీ. పుత్తూరు పట్టణంలోని ఆర్డీఎం గేటు వద్ద పాదయాత్ర ప్రారంభమై అంబేడ్కర్ సర్కిల్, సుబ్రమణ్యం స్వామి ఆలయం వరకు కొనసాగుతుంది. ఈక్రమంలో గొడుగులకు స్థానికులు భక్తిప్రపత్తులతో కర్పూర హారుతలిచ్చారు. నారాయణవనంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం శ్రీవారి గొడుగులను ఊరేగించారు. కల్యాణ వెంకన్న ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభించి, నగరి వీధి, శ్రీరాములు వారి ఆలయం నుంచి దుండి వినాయకస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది.

# కిటకిటలాడిన కల్యాణ వెంకన్న ఆలయం



కల్యాణ వెంకన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పెరటాసి మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు దీపారాధన చేశారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, పాల్గొన్నారు.

**హరినామసంకీర్తన**

తిరుపతిరూరల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): చిగురువాడలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పెరటాసి నెల మొదటి శనివారం సందర్భంగా 24గంటలపాటు భజనబృందసభ్యులు నిరవధికంగా హరినామ సంకీర్తన నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సంకీర్తన కచేరి ప్రారంభించారు. ఆదివారం ఉదయం వరకూ హరినామ సంకీర్తన కొనసాగుతుంది.

## మొక్కల పెంపకంతో హరితాంధ్ర సాధ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ తదితరులు

పాకాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షిస్తే హరితాంధ్ర సాధ్యమని ఎంపీపీ లోకనాథం ఎంపీడీవో వాసుదేవరావ్ అన్నారు. హరితాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలన్నారు. అడవులను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందిచాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో శశిరేఖ, ఏపీవో ఆశాలత, ఎంపిడీవో కార్యాలయ, ఉపాధిహామీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ●మొగరాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకంతో తలెత్తే అనర్థాలు, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు సుమలత అవగాహన కల్పించారు. గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్దుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ మిషన్ నిర్వహణపై చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాలను అడ్డుకోండి

తిరుపతి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికారిక భవన నిర్మాణాలను ప్రారంభ దశలోనే సచివాలయ కార్యదర్శులు అడ్డుకుని శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. నగరంలో అనధికారిక భవన నిర్మాణాలు, తదితర అంశాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, కార్యదర్శులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేని నిర్మాణాలు తొలగించే సమయంలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఫుట్ పాత్ ఆక్రమణలు , అనుమతులు లేని ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ఫైల్స్ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీసీపీ ఖాన్, సర్వేయర్ కోటేశ్వరరావు, మేనేజర్ హసీమ్‌లు ఉన్నారు.

## మెగా క్రికెట్ టోర్నీ విజేత ఎన్ఎస్‌యూ



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీయూ మైదానంలో శనివారం జరిగిన మెగా కార్పొరేట్ క్రికెట్ టోర్నీ తుదిపోరులో నేషనల్ సంస్కృత విశ్వవిద్యాలయం విజేతగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్ఎస్‌యూ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 167పరుగులు చేసింది. అనంతరం లక్ష్యచేధనకు బరిలోకి దిగిన ఎస్వీయూ 101పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. అత్యధికంగా 75 పరుగులుచేసిన ఎన్ఎస్‌యూ జట్టు బ్యాట్స్‌మెన్ శంకర్‌నాయక్ ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నాడు. ఎన్ఎస్‌యూ వీసీ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, ప్రొఫెసర్లు దక్షిణామూర్తి, సతీష్ తదితరులు విజేత జట్టును అభినందించారు.

## డీపీవోకు అద్దె బస్సుల యజమానుల వినతి



డీపీటీవోకు వినతి పత్రం అందిస్తున్న అద్దె బస్సుల యజమానులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొద్దికాలంగా తమ సమస్యలు రెట్టింపు అయ్యాయని, తక్షణమే సమస్యను పరిష్కరించాలంటూ ఆర్టీసీ అద్దె బస్సులు యజమానులు శనివారం సాయంత్రం డీపీటీవో జగదీష్‌కు వినతి పత్రం అందజేశారు. డ్రైవర్లకు భద్రత లేదని, అధికలోడ్ కారణంగా నిర్ణయించిన కిలోమీటర్లను అధికమించలేకపోతున్నామని, టైర్లు త్వరగా అరిగిపోతున్నాయని, సమయ పాలన సాధ్యపడడంలేదని, గూడూరు-నెల్లూరు నాన్‌స్టాప్ బస్సులను రద్దు చేయాలని, ప్రతి మార్గంలో అదనపు బస్సులు ఏర్పాటుచేయాలని, స్త్రీ శక్తి బస్సులకు ప్రత్యేక రంగులు వేయాలని విన్నవించారు. డీపీటీవో స్పందిస్తూ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ, అకౌంట్స్ ఆఫీసర్ చంద్రమణి, పీవో చాందిని పాల్గొన్నారు.

## అన్నదానం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్ర జ్యోతి): తిరుపతి సరోజినీ దేవి రోడ్డులోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో పెరటాసి మాసం తొలి శనివారం పురస్కరించుకుని అన్నదానం చేశారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కెయల్. శర్మ, పంచాయతీరాజ్ డీఈ మురళీ, రాధాకృష్ణ వర్మ, రాజా నరేష్, ఎస్‌బీఐ మేనేజర్ లీలామనోహర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్ఆర్.శ్రీనివాస్, సుజాత, పవన్, విష్ణు, మురళీరాజు, భావన, సత్యనారాయణ, ఆనంద్, చింజీవి పాల్గొన్నారు.

## ఉత్సవాలకు చెంగాళమ్మ ఆలయం ముస్తాబు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చెంగాళమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. 11 రోజులు అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## డ్వాక్రా సంఘాల యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న పీడీ శోభన్‌బాబు

తిరుపతి రూరల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): చిగురువాడ, అవిలాలలోని డ్వాక్రా సంఘాల మహిళలకు శనివారం మనడబ్బులు-మనలెక్కలు యాప్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు మాట్లాడుతూ..మహిళాసంఘాల లెక్కల్లో పారదర్శకతకు ఎండీఎంఎల్ యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు అన్ని వివరాలు మొబైల్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సభ్యులందరూ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛభారత్-స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు. డీపీఎం వెంకటేష్, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, సీసీలు, సంఘమిత్రలు, సీఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

## పరిశోధనలు విస్తృతంగా సాగాలి



ప్రొఫెసర్ అరుణ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేలా యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థల్లో పరిశోధనలు విస్తృతంగా సాగాల్సిన అవసరం ఉందని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మెటీరియల్ సైన్స్ ప్రొఫెసర్ టీఆర్ అరుణ్ పేర్కొన్నారు. మెటల్ కాంప్లెక్స్ అండ్ ఇంక్రీజింగ్ ఇంపార్టెన్స్ ఇన్ బయాలాజికల్ అప్లికేషన్స్ అంశంపై ఎస్వీయూ కెమిస్ట్రీ విభాగంలో చేపట్టిన సదస్సులో శనివారం ఆయన మాట్లాడారు. వ్యవసాయ, పారిశ్రామిక, వైద్య, ఆరోగ్య, పర్యావరణ సంబంధ అంశాల్లో మరింత విస్తృతంగా పరిశోధనలు సాగాలన్నారు. రాబోయే తరాల అవసరాలు, అవకాశాలను తీర్చేలా పరిశోధనలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, కెమిస్ట్రీ హెడ్ పద్మజ, ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి మాడవీధుల్లో శనివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. భజన మండలి కళాకారులు గోవిందరాజస్వామి ఆలయం నుంచి ప్రారంభించి మాడవీధుల్లో గోవింద నామాలు స్మరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరటాసి మాసం తొలి శనివారం కావడంతో కళాకారులు అధిక సంఖ్యలో ఈ సంకీర్తనకు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండా గోపీనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజ శేఖర్ రెడ్డి, మేకల గుంగయ్య, చెంగా రెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మురళి, సుబ్రహ్మణ్యం, మునిరత్న మాచారి, పద్మావతి, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## 1న దక్షిణ కాళికాదేవి ఆలయ కుంభాభిషేకం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి ఆలయం కుంభాభిషేక మహోత్సవానికి సిద్ధమైంది. ఇటీవల ఆలయాన్ని దాతలు, గ్రామస్తుల సాయంతో పునర్నిర్మించారు. అక్టోబరు 1న సుప్రభాతం, వేదపారాయణం, నవగ్రహ దిక్పాలక అష్టమాతృక, యోగిని దేవతల పూజా హోమం, చండీ హోమం, రుద్ర హోమం, 108 కలశాలకు మహా కుంభాభిషేకానికి పూజ, నైవేద్య సమర్పణ, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరగనుంది. 2న సుప్రభాతం, వేద పారాయణం, నిత్య విధులు, సర్వదేవతా హోమాలు, చండీహోమం, రుద్ర హోమం, దక్షిణ కాళి, మహాకాళి హోమాలు, మహాపూర్ణాహుతి, 108 కలశసహిత మహా కుంభాభిషేకం, దక్షిణ కాళికాదేవత అర్చన, మహానైవేద్య సహిత నీరాజనం, మంత్రపుష్పం, తీర్థవినియోగం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## మోటారు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని మూర్తిరెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌ను మినీలారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నాయుడుపేట పట్టణానికి చెందిన లక్ష్మణ్(35) ఓ ట్రాక్టర్ షోరూంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై మండలంలోని ఓ గ్రామానికి వెళ్లి వస్తుండగా మూర్తిరెడ్డిపాళెం వద్ద మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# పోకిరీల జోరు..పోలీసులు పట్టించుకోరు!

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంలో పోకిరీలు ఎక్కువైపోయారు. మద్యం మత్తులో మహిళలతో అసభ్యకరంగా ప్రవరిస్తూ ప్రశాంత తిరుపతికి భంగం కలిగిస్తున్నారు. తాజాగా గురువారం అర్థరాత్రి లీలామహల్ సర్కిల్ వద్ద పోకిరీలు మద్యం మత్తులో ఇద్దరు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి వారిపై దాడి చేశారు. అంతేకాకుండా నలుగురు పోకిరీలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని ఘర్షణపడ్డారు. పోలీసులు వారిని జైలుకు పంపారు.

● అదే రోజు మంగళం రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద నలుగురు పోకిరీలు నలుగురు యువతుల ముందు బీర్లు తాగుతూ వారిని వేధించారు. మాట వినకుంటే చంపుడే అంటూ బెదిరింపులకు దిగారు. మరో యువకుడు తాగిన మైకంలో ఒక యువతిని కర్రతో బాదుతూ చిత్ర హింసలకు గురిచేశాడు. లీలా మహల్ పరిసరాలలో దాదాపు 10 పీజీ, యూజీ మహిళల హాస్టళ్లు ఉన్నాయి. అలాగే పద్మావతి డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, బాలాజీ కాలనీ, పద్మావతిపురం, తిరుచానూరు రోడ్డు, మంగళం రోడ్డులో వివిధ కళాశాలలు, మహిళా హాస్టళ్ల ఉన్నాయి. ఆయా చోట్ల పోకిరీల బెడద ఎక్కువగా ఉంది. యువతులకు రక్షణ కరువవుతోంది.

ప్రధానంగా విద్యార్థినులను వేధించడం ఎక్కువగా ఉంది. ఆకతాయిలకు అడ్డుకట్టవేయాల్సిన పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

**ప్రైవేటు హాస్టళ్ల వద్ద కొరవడిన నిఘా**

నగరంలో ఎక్కడ పడితే అక్కడ బాలురు, ఉమెన్స్ హాస్టళ్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇక్కడి హాస్టళ్లపై నియంత్రణ లేకపోవడంతో అందులోని వారు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అర్ధరాత్రిపూట ఫ్లైఓవర్‌పై అబ్బాయిలతో పాటు అమ్మాయిలు బర్త్‌డే పార్టీలు చేసుకుంటున్నారు. ఇక బైక్ రేస్‌లతో మరికొందరు రాత్రిపూట రెచ్చిపోతున్నారు. పోలీసులు ప్రైవేటు హాస్టళ్ల నుంచి మామూళ్లు తీసుకుని తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి.

# తిరుపతి

## గంగమ్మ ఆలయానికి రూ.2లక్షల విరాళం



గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్‌కు విరాళం అందిస్తున్న డాక్టర్ సుధారాణి

తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి శ్రీసాయి సుధా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి రూ.2లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్‌కు శనివారం ఈ మొత్తం అందించారు. అంతకుముందు విరాళం అందించడానికి వచ్చిన ఆమెకు ఈవో జయకుమార్, పాలక మండలి సభ్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఆమెకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రావు, లక్ష్మణరావు, రుద్రకిషోర్, అర్చకులు రామకృష్ణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు పద్మావతి

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన ఉంటే దీనిని మొదట్లోనే నిర్మూలించే అవకాశం ఉంటుందని ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రముఖ స్త్రీల వైద్యనిపుణులు పద్మావతి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు ఆధ్వర్యంలో శనివారం గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ అంటే ఏమిటి దాని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే విషయాలపై ఆమె ఆస్పత్రిలోని మహిళా సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ నోడల్ అధికారి పద్మహస్త, ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్లు చందన, మృణాళిని, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



ప్రజల నుంచి సంతకాలను సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో దొంగ ఓట్ల నియంత్రణ కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి అందరూ మద్దతుగా నిలవాలని ఆ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు కోరారు. ఓట్ల చోరీ అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఆయన ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ నేతలు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు బాలగురవంబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణ, శివశంకర్, దామోదర్‌రెడ్డి, వీరమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబరు 25 నుంచి బాలోత్సవం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రోటరీ క్లబ్ సౌజన్యంతో అక్టోబరు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరిగే బాలోత్సవం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున, గౌరవ అధ్యక్షులు దామోదరం, అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న సృజనను, ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఆశయంతో మూడేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తిరుపతి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అకడమిక్ కల్చరల్ విభాగాల్లో 37 అంశాల్లో 75 విభాగాలుగా ఎనిమిది వేదికలపై సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిన్నారులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి గురునాథం, ముఖేష్, జేవీవీ రఫి, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్రశెట్టి, మట్టా పురుషోత్తం రెడ్డి, హేమచంద్ర, హెల్పింగ్ టూ ఆర్ఫ్ మణికంఠ, వుయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు తహసున్నీసా, దివ్యాంగ్ సేవా ట్రస్టు మునిలక్ష్మి, చెస్ బాలాజీ, తైక్వాండో బాలకృష్ణ, ఇంపాక్ట్ శ్రీధర్, విట్టలం చిత్రకారులు డాక్టర్ సాగర్ గిన్న, అర్చన, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులతో గౌరవంగా మెలగండి



ట్యాక్సీ డ్రైవర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులతో ట్యాక్సీ డ్రైవర్లు మర్యాదపూర్వంగా మెలగాలని డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి సూచించారు. శనివారం విష్ణునివాసంలో తిరుపతిలోని ట్యాక్సీ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ సమావేశంలో వెస్ట్ డీఎస్పీ ప్రసాద్, ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ట్రాఫిక్ సీఐలు సంజీవ్‌కుమార్, భాస్కరనాయక్, సుబ్బురామి రెడ్డి, రైల్వే సీఐ ఆశీర్వాదం, విజిలెన్సు ఏవీఎస్ఓలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ఎస్టీవీ నగర్‌లో స్థల వివాదం

తిరుపతి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్టీవీ నగర్‌లో ఉన్న సర్వే నెంబరు 72/1బీలోని స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగింది. ఈ వివాదంపై ఓ వర్గానికి చెందిన వి.నిర్మల, వి.వేణి, శశికళ, కమలేశ్, మహేశ్వరన్‌లు శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. 'సదరు స్థలం విషయంపై 2022నుంచి కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఆ వివాదాస్పద భూమిలో వి.శ్రీకాంత్‌రెడ్డి, ఓ రాజకీయ పార్టీకి చెందిన మధు, హరి, ఆటోనగర్ మూర్తి, దుర్గసముద్రం చందు తదితరులు 18వ తేదీ రెండు ఎక్స్‌కవేటర్లతో వచ్చి అక్కడున్న నిర్మాణాలను దౌర్జన్యంగా కూల్చివేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదుచేశాం' అని వివరించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు తేదీ 23

తిరుపతి(విద్య), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యాసంవత్సరానికిగాను 9, 11 తరగతుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈనెల 23వ తేదీతో ముగుస్తుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్. ఎన్. విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 2026 ఫిబ్రవరి 7వ తేదీన పరీక్ష జరగనుంది. 9వ తరగతి ప్రవేశానికి 2025-26 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ... 2011 మే 1వ తేదీ నుంచి 2013 జూలై 31వ తేదీలోపు జన్మించినవారై ఉండాలి. అలాగే 11వ తరగతి ప్రవేశానికి 2025-26 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 2009 జూన్ 1వ తేదీ నుంచి 2011 జూలై 31వ తేదీలోపు జన్మించినవారై ఉండాలి. మరిన్ని వివరాలకోసం 86888 88802 / 93999 76999 సెల్‌ఫోన్ నంబర్లలోగాని, స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీపరీక్ష కేంద్రంలోగాని సంప్రదించవచ్చని ఆయన తెలియజేశారు.

## అప్పు తెచ్చిన తంటా
## ఇరువర్గాల ఘర్షణ

### కేసుల నమోదు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల వివాదం రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. గతంలో కేశవాయనగుంటలో ఉమామహేశ్వరి, ఆమె భర్త చంద్రబాబు కాపురం ఉండేవారు. పలువురి వద్ద అప్పులుచేశారు. సకాలంలో చెల్లించకపోవడంతో గతంలోనే తిరుపతి రూరల్ స్టేషన్‌లో వీరిపై కేసులు నమోదయ్యాయి. తర్వాత వారు అక్కడ నుంచి ఇటీవల గొల్లవానిగుంటకు కాపురం మార్చారు. ఈ నేపథ్యంలో వారికి అప్పులు ఇచ్చిన డోలిశ్రీ, మురళీబాబు, కవిత, జ్యోతి, హితేష్, గీత, గీత భర్త, గీత సోదరుడు, జమీలా, నాగలక్ష్మి శనివారం గొల్లవానిగుంటలోని వారి ఇంటికి వెళ్లారు. డబ్బులు ఇవ్వాలని కోరారు. దీనిపై వారి మధ్య వాగ్వాదం జరిగింది. అది ఘర్షణకు దారితీసింది. గీత సోదరుడికి తీవ్ర రక్తస్రావం అయింది. ఇరువర్గాలపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.



## పెరటాసి.. అలిపిరి కిక్కిరిసి

**అలిపిరి పాదాల మండపం వద్ద పోటెత్తిన భక్తజనం**

**పిండి దీపాలు వెలిగిస్తున్న మొక్కులు**



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద పెరటాసి మాసం తొలి శనివారం పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. వెంకటేశ్వరస్వామి ఆరాధనకు ఈ మాసం శ్రేష్ఠమైనదిగా భావిస్తారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పిండి దీపాలను వెలిగించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండపంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అలిపిరి మండపం వద్దకు వచ్చి పూజలు చేస్తున్నారు. సాయంత్రానికి భక్తులు సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. నడక మార్గంలో తిరుమలకు వెళ్తున్న భక్తులు ఓ వైపు.. పూజలు చేయడానికి వచ్చిన స్థానిక భక్తులు మరో వైపు ఇలా పాదాల మండపం ప్రాంతం కిక్కిరిసిపోయింది. గోవింద నామస్మరణలతో మార్మోగింది.

## ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తిరుపతి: కమిషనర్



మొక్క నాటుతున్న దృశ్యం

తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా తిరుపతిని మార్చేందుకు అధికారులు కృషిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య సూచించారు. స్వచ్ఛత హి సేవ, స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా మూడవ శనివారం హోమ్ కంపోస్టింగ్ పై మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు అవగాహన కల్పించారు. ఎరువులు, మొక్కలను కమిషనర్ పంపిణీ చేశారు. గొల్లవానిగుంట వద్దనున్న తొండమాన్ చక్రవర్తి మార్గంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీమునికృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ కుమారమ్మ, రజక సంఘం డైరెక్టర్ కరాటే చంద్ర తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 5వేల మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని మొక్కలకు జియో టాగింగ్ చేస్తామని అన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నియంత్రించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ ఖాన్ పాల్గొన్నారు.

## వీధి కుక్కలకు కు.ని ఆపరేషన్లు



వీధి కుక్కలను పట్టుకుని యానిమల్ కేర్ వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలకు మున్సిపల్ వెటర్నరీ సిబ్బంది శనివారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఈ నెల 19న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కుక్కలు పీక్కలు పీకేస్తున్నాయి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన మున్సిపల్ వెటర్నరీ అధికారి గుణశేఖర్ తమ సిబ్బందితో కలసి మధురానగర్, అశోక్‌నగర్, రైల్వే కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి వీధుల్లో తిరుగుతున్న దాదాపు 45 కుక్కలను పట్టుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. మరికొన్ని శునకాలను వ్యాక్సిన్లు వేశారు. వీటిని దాదాపు ఐదు రోజుల పాటు సంరక్షణలోనే వుంచుకుని మళ్లీ వదిలి పెడతామని ఆయన తెలియజేశారు. ఇతరప్రాంతాల్లోనూ కుక్కల బెడదను తగ్గిస్తానని వివరించారు.

**ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్**



విద్యుత్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

## పోరాటాలు ఉధృతం చేస్తాం

### విద్యుత్ జేఏసీ నాయకుల హెచ్చరిక

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సమ్మె తప్పదని జేఏసీ డిస్కం, తిరుపతి సర్కిల్ నాయకులు దేవేంద్రరెడ్డి, టి.జయరామ్, మురళీధర్, ఎల్.చలపతి, నాగరాజు, వి.గోపీ, జి.వేలాయుధం హెచ్చరించారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట శనివారం రెండవ రోజు నిరాహార దీక్షలను వారు ప్రారంభించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి పలు మార్లు తమ వినతులు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. విధిలేని పరిస్థితిలో వారం రోజులుగా దశల వారీగా ఆందోళనలు చేస్తున్నామన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన సర్వీసులకు అనుగుణంగా ఉద్యోగుల నియామకం చేపట్టాలన్నారు. జేఎల్ఎం గ్రేడ్-2 వారిని వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఆందోళనల్లో మొదటిదశ సోమవారంతో ముగుస్తుందన్నారు. తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో మరోసారి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో నాయకులు వెలగటూరు గోపీ, సుబ్రమణ్యం, జనార్ధన్, శశి, కార్తీక్. సీవీ.వేణు, పుత్తూరు, నాయుడుపేట, తిరుపతి టౌన్, రూరల్, డివిజన్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

## ధ్యానంతో ఆరోగ్యం



ధ్యాన మహాయజ్ఞంలో సందేశాన్ని వినిపిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ వీరరాఘవరావు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరుగుతున్న ధ్యాన మహాయజ్ఞంలో భాగంగా ఐదో రోజైన శనివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ తలర్తి వీరరాఘవరావు, ప్రేమ్‌నాథ్, హైదరాబాదుకు చెందిన ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ జ్ఞాని దుఃఖంలోనూ ఆనందంగా ఉంటారని తెలిపారు. అనంతరం నాయుడుపేటకు చెందిన ఆర్.వర్షిని నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన ఆదిలక్ష్మీ బృందం సంగీత ప్రదర్శన అలరించింది. యూనివర్సల్ సింగర్స్ రామాంజనేయులు, పద్మావతిలు ఆధ్యాత్మిక గీతాలను అలపించి మైమరపించారు. అంతకు ముందు మూడు గంటలపాటు అఖండ సామూహిక మౌన ధ్యాన సాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం తిరుపతి జిల్లా అధ్యక్షులు కంచి రఘురాం, ధ్యాన మహాయజ్ఞం చైర్మన్ సంగీతబాబు, సభ్యులు హనుమంతరావు, సేత్ బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## బార్లపై పోలీసుల దాడులు



తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతిలో ఈస్ట్ పోలీసులు డీఎస్పీ భక్తవత్సలం స్వీయ పర్యవేక్షణలో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉదయం 10 బార్లపై దాడులు చేశారు. ప్రధానంగా రెండు రోజుల క్రితం ఆరుగురు పోకిరీలు అమెరికన్ బార్‌లో మద్యం సేవించి అక్కడ ఒకరినొకరు కొట్టుకున్నారు. అక్కడ నుంచి ఎర్రమిట్టకు చెందిన ముగ్గురు ఆకతాయిలు స్థానిక మంగళం రోడ్డులో ఇద్దరు మహిళలతో అనుచిత ప్రవర్తన చేశారు. ఒక దశలో దాడి చేశారు. ఈ ఘటనపై ఎస్పీ సీరియస్‌గా స్పందించారు. తక్షణం బార్లపై తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్న వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు, ఎస్టీఎఫ్ సిబ్బంది కలసి అమెరికన్ బార్, బడి బార్, యాలమూరి బార్, విక్టరీ బార్, డాల్ఫిన్ బార్‌లలో తనిఖీలు చేశారు. సంబంధిత మేనేజర్లను పిలిపించి మాట్లాడారు. మద్యం మత్తులో బార్లలో జరిగే ఘర్షణలకు సంబంధిత యాజమాన్యాలు, మేనేజర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఐ హెచ్చరించారు. మళ్లీ జరిగితే కేసులు నమోదు చేసి అరెస్టులు, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

## పరిసరాల శుభ్రత ఆరోగ్యానికి భద్రత



రుయాస్పత్రిలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ రాధ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యానికి భద్రత ఉంటుందని రుయా సూపరింటెండెంట్ రాధ అన్నారు. రుయాస్పత్రిలో ఆమె శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలోని సిబ్బందికి పరిసరాల శుభ్రతపై పలు సూచనలు చేశారు. ● ఎస్వీ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ రవిప్రభు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల శుభ్రతకు కృషి చేస్తామని సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ, వైస్ ప్రిన్సిపల్స్ వెంకట్, మూర్తి, వైద్యాధికారులు సునీత, మాధవి పాల్గొన్నారు.

## పరకామణి కేసు సీబీసీఐడీకి దైవానుగ్రహం

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరకామణి కేసును సీబీసీఐడీకి అప్పగించడం దైవానుగ్రహమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరకామణిలో జరిగిన ఫారెన్ కరెన్సీ కుంభకోణంలోని సూత్రధారులు, పాత్రధారులు, ఇంటి దొంగల గుట్టురట్టు చేసేందుకు శ్రీనివాసులు వేసిన కేసుతో హైకోర్టు ఆదేశాలతో సీబీసీఐడీ రంగంలోకి దిగడం అంటే పాపం పండే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

## శ్రీవారికి కానుకగా ఎలక్ట్రిక్ బైక్



హైదరాబాద్‌కు చెందిన బిగాస్ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం రూ.1.10 లక్షల విలువైన బిగాస్ ఎలక్ట్రిక్ బైక్‌ను తిరుమల శ్రీవారికి కానుకగా అందజేసింది. టీటీడీ ఏఈవో మోహన్‌రాజుకు సంస్థ ఆర్ ఎస్‌ఎం రామారావు బైక్ తాళాలను అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



## ‘ఓజీ’ పెద్ద హిట్ కావాలి

● నిర్మాత డీవీవీ దానయ్య

ఈనెల 25న విడుదల కానున్న పవన్‌కల్యాణ్ నటించిన ‘ఓజీ’ సినిమా పెద్ద హిట్ కావాలని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరానని ఆ చిత్ర నిర్మాత డీవీవీ దానయ్య తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కాగా శనివారం శ్రీవారిని ఉడిపిలోని పాలిమారు మఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామిజీ, ఢిల్లీ ఏపీ ప్రభుత్వ సలహాదారు ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## తమిళ జాలర్ల బోటు పట్టివేత

వాకాడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసపురం సముద్ర తీరంలో అక్రమంగా వేట సాగిస్తున్న తమిళనాడు ప్రాంతానికి చెందిన కరైకల్ జాలర్ల స్పీడ్ బోట్‌ను శుక్రవారం రాత్రి మత్స్యకారులు పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం కరైకల్ ప్రాంతానికి చెందిన 16 మంది మత్స్యకారులు శ్రీనివాసపురం సముద్రతీరంలో చేపలను వేటాడుతుండగా స్థానిక జాలర్లు అడ్డుకుని బోట్‌ను అదుపులోకి తీసుకున్నారు. బోట్‌ను నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె పోర్టులో అప్పజెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి చెన్నై రాష్ట్రానికి చెందిన స్పీడ్ బోట్ ఆంధ్రా తీరం వైపు రాకుండా చూడాలని కోరారు.


## సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం: రూ.4.04 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,249**

**తలనీలాలు సమర్పించినవారు: 22,901**






- బ్రాండెడ్ షాపులోనూ నాణ్యత లేని మందులే
- తనిఖీల్లో వెల్లడైనా చర్యలు తీసుకోని టీటీడీ
- వైసీపీ హయాంలో మొదలై నేటికీ కొనసాగుతున్న అక్రమాలు

# ఈ రోగానికి మందేది?

● స్విమ్స్ జనరిక్ షాపులో బ్రాండెడ్ మందులు



తిరుపతి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ ఆవరణలో మందుల మాయాజాలం నడుస్తోంది. బ్రాండెడ్ మందులు మాత్రమే విక్రయించాల్సిన షాపులో జనరిక్ మందులు, జన ఔషధి షాపులో బ్రాండెడ్ కంపెనీల మందుల విక్రయం జరుగుతోంది. ప్రిస్క్రిప్షన్‌లో రాసిన మందులకు బదులు నాసిరకం అంటగడుతున్నారు. వైద్య బృందాల తనిఖీలో మందుల బాగోతం తేలినా టీటీడీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వంలో కీలక నేతల మద్దతుతో మొదలైన మందుల షాపుల అక్రమాలు ప్రభుత్వం మారినా కొనసాగుతుండడం విమర్శలకు దారితీస్తోంది.



13. Some drugs like Inj.ERYTHROPOIETIN and DINOPROSTONE GEL were found in wet condition inside refrigerator.

Mrs.T.Rajini Dr.M.C.R.Rama Dr.Rajasheker

Dr.Mumthaja Dr.K.R.Subash (Leave) Dr.R.Ram

Copy to all members
The Director cum VC for kind information.
The Medical Superintendent for necessary action.
The AD (OM) for necessary action.

స్విమ్స్‌లో ఇన్నోవేటివ్ ఫార్మా మందుల షాపులో క్వాలిటీ చెక్,రీ చెక్ చేసినా తప్పిదాలు సరిదిద్దుకోలేదని వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

### ఇన్నోవేటివ్‌గా దోపిడీ!

స్విమ్స్ ఆవరణలో గతేడాది డిసెంబరులో ఇన్నోవేటివ్ ఫార్మాసూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఓ మందుల షాపు వెలిసింది. కేటగిరీ పరంగా ఇందులో బ్రాండెడ్ కంపెనీల మందులు విక్రయించాలి. ఈ షాపు నెలవారీ అద్దె రూ.31 లక్షలంటే వ్యాపార స్థాయి ఊహించవచ్చు. అధిక ఖరీదు కలిగిన మందులు విక్రయిస్తున్నా చాలా మటుకు నాసిరకమనే ఆరోపణలున్నాయి. ఈనెల 6వ తేదీన బక్కయ్య(64) అనే రోగికి వైద్యులు నాలుగు రకాల మందులు రాశారు. అందులో ఎకోస్ప్రిన్ మాత్రల బదులు నాణ్యత లేని ఎకోప్రిల్ విక్రయించారు. స్ట్రోక్ వస్తే మెదడులో రక్తం గడ్డ కట్టకుండా ఉండడానికి ఈ మాత్ర ఉపకరిస్తుంది. నాసిరకం మాత్రల వల్ల అనర్థం సంభవించే ప్రమాదముంది. ముపిరోసిన్ అనే ఆయింట్‌మెంట్ బదులు టి.మ్యూస్ క్రీమ్ అనే నాసిరకం విక్రయించారు. స్టిలోజ్ ట్యాబ్‌లెట్ రాస్తే నాణ్యత లేని సిలోబాక్ట్ ఇచ్చారు. ట్రీటెల్ మాత్ర బదులు పెరిటాల్ అనే నాసిరకం మాత్ర ఇచ్చారు. గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న కె.జయమ్మకు కూడా వైద్యులు రాసిన నాణ్యమైన మందులకు బదులు నాణ్యతలేని మందులు ఇచ్చారు. దీంతో ఆరోగ్యం క్షీణించి ఆమె ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యుల ద్వారా నిర్ధారించుకున్న జయమ్మ కుటుంబీకులు గత నెల 22న స్విమ్స్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనూ ఈ షాపుపై అనేక ఫిర్యాదులు వచ్చాయి.

### రెండవ తనిఖీలోనూ అవే తప్పిదాలు

వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేసినా ఈ షాపుపై ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.దీంతో రెండోసారి అంటే మే 9న వైద్యుల బృందం మళ్లీ తనిఖీ చేసింది.మునుపు గుర్తించిన తప్పిదాలను సరిదిద్దుకోలేదని తేల్చింది. అదనంగా మరిన్ని ఉల్లంఘనలు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చింది.. అయినా ఈ దుకాణంపై చర్యలు తీసుకోలేదు.

### 5 శాతమే జనరిక్ మందులు

స్విమ్స్ ఆవరణలో ఓపీడీ బ్లాకు వద్ద వెలుపల బర్డ్ భవనంలో పీఎంబీజేకే పథకం కింద ఈ ఏడాది జూన్‌లో జన ఔషధి షాపు ఏర్పాటైంది. దీని నెలవారీ అద్దె రూ.5 లక్షలు. ఇందులో 90 శాతం జనరిక్ మందులు ఉండాలి. తక్కువ ధరలకు విక్రయించాలి. అయితే బ్రాండెడ్ పేరిట నాసిరకం మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండడంతో గత నెల 23న ఏడుగురు సీనియర్ వైద్యుల బృందం తనిఖీ చేసింది. జనరిక్ మందులు 5 శాతం మాత్రమే ఉన్నాయని గుర్తించింది. ధరలు కూడా జన ఔషధి నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తున్నట్టు తేలింది.



స్విమ్స్ జన ఔషధి షాపులో తనిఖీలు చేపట్టి అక్రమాలపై వైద్యుల బృందం ఇచ్చిన నివేదిక

### వైసీపీ హయాంలోనే అక్రమాలకు బీజం

2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే టీటీడీలో అప్పటి కీలక వ్యక్తి సిఫారసుతో స్విమ్స్ ఓపీడీ బ్లాకులో రోగుల వెయిటింగ్ హాలును మందుల షాపుగా మార్చేశారు. అక్కడ పీఎంబీజేకే పథకం జన ఔషధి షాపు పెట్టారు. నెలవారీ అద్దె కేవలం రూ.20 వేలుగా నిర్ణయించారు. అక్కడ రోజువారీ వ్యాపారం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల దాకా జరిగేది. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బ్రాండ్లుగా కంపెనీల పేర్లు చూపి అధిక ధరలకు నాసిరకం మందులు విక్రయించారన్న ఫిర్యాదులు వచ్చాయి. అయినా చర్యలు తీసుకోకపోగా ఏటా పది శాతం అద్దె పెంపుతో ఐదేళ్లు షాపును కొనసాగించారు. 2023 ఆగస్టులో సంబంధిత టీటీడీ కీలక వ్యక్తి పదవి నుంచి తప్పుకోబోయే ముందు ఈ షాపు లైసెన్స్ గడువును 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2026 మార్చి 31వరకు ఏకంగా మూడేళ్ల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది డిసెంబరులో ఈ షాపు మూతపడింది. వైసీపీ కీలక నేత సిఫారసుతో ఈ షాపును బినామీ పేరుతో దక్కించుకున్న వ్యక్తి ఆ వెంటనే అదే నెలలో ఇన్నోవేటివ్ ఫార్మా పేరిట బ్రాండెడ్ మందుల షాపు ఏర్పాటు చేశారు. తర్వాత ఆరు నెలల వ్యవధిలోనే బినామీ పేరుతో జన ఔషధి షాపు తెరిచారు.

### కీర్తి బ్రాండెడ్ షాపులో నాసిరకం మందులు


బర్డ్ ఆస్పత్రి భవనంలో కీర్తి మెడికల్ స్టోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో నడుస్తున్న బ్రాండెడ్ మందుల షాపు వ్యవహారం కూడా వివాదాస్పదంగా ఉంది. ఈ షాపు నెలవారీ అద్దె రూ.18 లక్షలు. స్వల్ప కాలంలోనే ఈ షాపుపై ఫిర్యాదులు రావడంతో స్విమ్స్ బర్డ్ ఉన్నతాధికారులు గత నెల 23న తనిఖీ చేశారు. బ్రాండెడ్ మందులకు బదులు జనరిక్ మందులే ఉండడాన్ని గుర్తించారు.వాటిని తొలగించి 90శాతం మందులు బ్రాండెడ్ మందులు ఉంచాలని ఆదేశించారు.దీనిపై గత 25న బర్డ్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినా టీటీడీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

**తొలి తనిఖీలో వాస్తవాలుగా తేలిన ఆరోపణలు**

ఫిర్యాదులు తరచూ వస్తుండడంతో స్విమ్స్ వైద్యుల బృందం ఈ ఏడాది ఏప్రిల్ 15న ఇన్నోవేటివ్ షాపులో తనిఖీలు చేపట్టారు. బ్రాండెడ్ కేటగిరీకి అనుమతి ఇవ్వగా 80 శాతం జనరిక్ మందులే ఉన్నట్లు గుర్తించారు. హై రిస్క్ మందులు, అత్యవసర మందులను విడివిడిగా నిల్వ చేయడం లేదని గుర్తించారు. గడువు సమీపిస్తున్న మందులను కూడా సాధారణ మందులతో పాటు కలిపే ఉంచుతున్నట్టు గమనించారు. ఈ లోపాలతో పాటు రూమ్ టెంపరేచర్ ప్రోబ్ కూడా పనిచేయడం లేదని వైద్యుల బృందం స్విమ్స్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేసింది.

## ఐసర్‌లో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అకడమిక్ సహకారాన్ని బలోపేతం చేయడమేగాక యువ పరిశోధకులకు వేదిక కల్పిస్తామని ఐసర్ ప్రతినిధులు చెప్పారు. మండలంలోని తిరుపతి ఐసర్ ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, జర్మనీ అకడమిక్ ఎక్స్ఛేంజ్ సర్వీస్‌తో పాటు బంగ్లాదేశ్, భూటాన్, భారత్, నేపాల్, శ్రీలంకలకు చెందిన డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్ల నెట్‌వర్క్ సహకారంతో ఎర్లీ కెరీర్ రీసెర్చ్ సింపోజియం నిర్వహించారు. ఇంటిగ్రేటివ్ బయోసైన్సెస్ - డేటా డ్రివన్ డిస్కవరీ అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో బయాలజీ డేటా సైన్స్ రంగాల అనుసంధానంపై ప్రసంగాలు, చర్చలు జరిగాయి. వ్యక్తిగత వైద్య పద్ధతులు, వ్యాధి అంచనాలు, శాస్త్రీయ ఆవిష్కరణల్లో డేటా సైన్స్ పాత్రపై ప్రధానంగా దృష్టి పెట్టారు. బయోమెడికల్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలపై డాక్టర్ నాగరాజు గణపతి(ఐఐటీ హైదరాబాద్), డాక్టర్ శ్రేయా శ్రీనివాసన్(హార్వర్డ్ యూనివర్శిటీ) వివరించారు. ఔషధ ఆవిష్కరణలు, ట్రాన్స్‌లేషనల్ సైన్స్, మేధో సంపత్తి హక్కులపై డాక్టర్ అంబ్రిస్ సక్సేనా, డాక్టర్ రఘునాథ్, ఓ.రామభద్రన్ (తిరుపతి ఐసర్) చర్చించారు. మాలిక్యూలర్ బయాలజీ, డేటా మైనింగ్‌పై డాక్టర్ శృతి ఎస్ వెంబర్(ఐబీఏబీ, బెంగళూరు) ఉపన్యసించారు. తిరుపతి ఐసర్ ప్రతినిధి డాక్టర్ వసుధారాణి దేవనాథన్, తిరుపతి ఐఐటీ ప్రతినిధి డాక్టర్ పంచచారం మారియప్పన్, డీఏఏడీ రీసెర్చ్ అంబాసిడర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అపోలో, ఎస్వీ, పద్మావతి మహిళా యూనివర్శిటీలు, తిరుపతి ఐఐటీ, ఐసర్ నుంచి వచ్చిన 200మందిపైగా విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. జర్మనీలో లభించే పరిశోధన అవకాశాలను డీఏఏడీ ప్రతినిధులు విద్యార్థులకు వివరించారు. ఐసర్ రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ క్లోహీ, లెఫ్టినెంట్ కల్నల్ హిమాంశు శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దొంగలు చొరబడుతున్న సీసీ కెమెరా ఫుటేజ్

## ఇంట్లో దొంగల బీభత్సం

● కత్తులతో బెదిరించి దోపిడీ

● రూ.70వేల నగదు, 100 గ్రాముల బంగారు ఆభరణాల అపహరణ

చంద్రగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ కాశిపెంట్లలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం చేశారు. కత్తుల బెదిరించి దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు .. గ్రామంలోని ఓ ఇంట్లో గల్లా నాగేశ్వరనాయుడు, భార్య సుశీల, ఆయన తల్లి ద్రౌపది ఉన్నారు. వీరి కుమారుడు ప్రశాంత్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి 9గంటలకు నాగేశ్వరనాయుడు దంపతులు తమ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తుల కారులో ఇంటి ముందుకు వచ్చారు. గేటు ముందు హారన్ కొడుతుండటంతో సుశీలమ్మ వెళ్లి తలుపు తీసేందుకు ప్రయత్నిస్తుండగానే ఇంటి వెనుక వైపు నుంచి ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు లోనికి ప్రవేశించారు. ద్రౌపది చేతులు తువ్వాలు కట్టేసి, నాగేశ్వరనాయుడు, సుశీలమ్మలకు కత్తులు చూపించి బెదిరించారు. కప్‌బోర్డులో ఉన్న రూ.70 వేల నగదు, వంద గ్రాములు బంగారు ఆభరణాలు తీసుకున్నారు. ఫోన్లో మాట్లాడుతున్న కుమారుడు ప్రశాంత్ ఇక్కడి అలజడిని గమనించాడు. దొంగలు పడ్డారని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి వెంటనే గ్రామంలో తెలిసిన కొందరికి ఫోన్ చేశాడు. గ్రామస్తులు చేరుకుని కేకలు వేస్తూ రావడంతో దొంగలు కారులో పరారయ్యారు. గ్రామస్తులు 100కి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది చేరుకుని దుండగులు కోసం గాలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలు సేకరించింది. బాధితుడు నాగేశ్వరనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఈత సరదాకు బాలుడి మృతి

● మరొకరి గల్లంతు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో ఓ బాలుడు మృతిచెందాడు. మరో బాలుడు గల్లంతయ్యాడు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి తెలిపిన వివరాలు... పట్టణంలోని ఓటేరు కాలువ వీధికి చెందిన నాజర్ ప్రైవేటు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కుమారుడు హారున్(8) ముత్యాలమ్మ గుడి వీధి పురపాలక సంఘ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. శ్రీకాళహస్తి పట్టణం దోబీఘాట్‌కి చెందిన గుణ(14) మరో నలుగురు పిల్లలతో కలిసి మొత్తం ఆరుగురు శనివారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లారు. పట్టణంలోని దోబీఘాట్ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో ఈత కొడుతుండగా హారున్, గుణ నీటి వేగంతో కొట్టుకు పోయారు. మిగతా నలుగురు పిల్లలు కేకలు వేయడంతో సమీపంలో ఓ పురపాలక సంఘ పారిశుధ్య కార్మికుడు అరుణ్ హారున్‌ను ఒడ్డుకు చేర్చాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గల్లంతైన గుణ కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





షేక్ హారున్ మృతదేహం - గుణ (ఫైల్‌ఫొటో)

## స్వర్ణముఖి నదిలో వృద్ధుడి గల్లంతు



పాపయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నది దాటుతూ ఓ వృద్ధుడు గల్లంతయిన ఘటన మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన చమర్తి పాపయ్య (65) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నది దాటే ప్రయత్నం చేశాడు. ఇటీవల తెలుగుగంగ జలాలను స్వర్ణముఖి నదికి వదలడంతో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఆ విషయం తెలుసుకోలేకపోయిన పాపయ్య నదీ ప్రవాహానికి కొట్టుకుపోయాడు. చీకటి పడే వరకు స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. చీకటిపడటంతో గాలింపు చర్యలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం అగ్నిమాపకదళ సిబ్బందితో కలసి గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్



తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రణాళికలు పరిశీలిస్తున్న ఎస్‌డీజీఎం చేతననంద్ సింగ్

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతం చేయాలని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ చేతననంద్ సింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం స్టేషన్ దక్షిణం వైపు జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి, ప్రయాణికుల అవసరాల మేరకు పనులు ఉండేలా చూడాలని ఆదేశించారు. నూతన భవనాల్లో వ్యాపార పరమైన అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్‌ఎంఆర్ డాక్టర్ కె.చిన్నపరెడ్డి, డిప్యూటీ సీఈ వామనరావు, డి.ప్రభాకర్, మాధవరావు పాల్గొన్నారు.

## సందడిగా కళాంగిని వేడుక

● ఐఐటీలో ఆర్ట్ వర్క్‌షాప్ విజయవంతం



పెయింటింగ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఐఐటీ, ఐసర్ విద్యార్థులతో ఆర్టిస్టులు

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ సందడిగా సాగింది. ఐఐటీకి చెందిన ఆర్టిస్టా.. ది ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో తలపెట్టిన కళాంగిని వేడుక మొదటి రోజైన శనివారం ఉల్లాసభరితంగా సాగింది. ఐఐటీ, ఐసర్‌లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తిరుపతికి చెందిన మహిళా ఆర్టిస్టులు రాగిమాను శ్రీదేవి, జి.గాయత్రి, బత్తుల అర్చన, ఎస్.లావణ్య పాల్గొని విద్యార్థులకు పెయింటింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఫ్లోరల్, సీనరీ, పాట్ అడోర్నమెంట్, పేపర్ డెకార్ తదితర అంశాల్లో సలహాలు, సూచనలు ఇచ్చారు. ఫ్యాకల్టీ అడ్వైజర్ పంచేటి జష్వవ్, ఆర్ట్ క్లబ్ హెడ్ అర్నా రుబీన్, మెంటార్ రోహన్ రతన్, క్లబ్ సభ్యులు బీఎస్ఎన్ కౌశిక్, రిషికేష్ రెడ్డి, సాత్విక్ పిల్యానం, హర్షవర్ధన్, రూబితా రంగనాథన్, సిద్ధార్థ గుంటూరు, నాగశ్వేత, శ్రీవర్షిని, రుతిక, మేఘ్ మెహతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## జెండా ఉత్సవాలకు గూడూరు ముస్తాబు





గమ్మళ్లపాళెంలో విద్యుత్ దీపాలంకరణ

గూడూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలకు ముస్తాబైంది. ఏటా విజయదశమికి ముందు వచ్చే అమావాస్య నాడు పట్టణంలో ఆంజనేయస్వామి జెండాలను ఊరేగించడం ఆనవాయితీ. పట్టణంలో సుమారు 40కి పైగా ప్రాంతాల్లో జెండా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా గమ్మళ్లపాళెం, మిట్టపాళెం, తూర్పువీధి, కర్ణాలవీధి, కోనేటిమిట్ట, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్‌దీపాలతో వివిధ దేవుళ్ల కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని వీధులన్నీ విద్యుద్దీపాలకరణతో శోభాయమానంగా మారాయి. ఆదివారం ఉదయం ఆంజనేయస్వామి జెండాలకు పూజలు నిర్వహించి వీధుల్లో ఊరేగిస్తారు. తరువాత ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేకంగా అలంకరిస్తారు. రాత్రి ఈ గ్రామోత్సవంలో తప్పెట్లు, తాళాలు, జింగిరి మేళాలు, కాంతార, బేతాళ నృత్యాలు, కోలాటాలు, తెనాలిబ్యాండు, కేరళ వాయిద్యాలు నడుమ ఆంజనేయస్వామి జెండాలకు గ్రామోత్సవం జరుపుతారు.

## కబడ్డీ పోటీల్లో వెరిటాస్ ప్రతిభ






పాఠశాలకు చెందిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందిస్తున్న చైర్మన్ శేషారెడ్డి

ములుగు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని గెలుచుకున్నారని వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లి పాఠశాలలో కబడ్డీ క్రీడాకారులను, కోచ్‌లు శంకర్, నరేశ్‌లను ఆయన సన్మానించి, అభినందించారు. బీహార్ రాష్ట్రం రోహతక్‌లోని నారాయణ్ వరల్డ్ స్కూల్‌లో ఈ నెల 13 నుంచి 17వరకు జాతీయ స్థాయి సీబీఎస్ఈ క్లస్టర్స్ అండర్-17 బాలుర కబడ్డీ పోటీలను నిర్వహించగా, తిరుపతి వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు లీగ్ దశ నుంచి ఫైనల్‌కు చేరారు. శ్రీగురు హరికృష్ణన్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 45-52 పాయింట్స్‌తో వెనుకబడి రన్నర్స్‌గా నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు కబడ్డీలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని సీబీఎస్ఈ పాఠశాలల నుంచి ఇప్పటివరకు ఎవరూ సాధించని జాతీయ స్థాయి పతకాన్ని సాధించారని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి, డీన్ సీజీహెచ్ ఖాన్, ప్రిన్సిపాల్ పీఆర్ఎస్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ యస్. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## 18మంది స్మగ్లర్ల అరెస్టు

● 16 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి 18మంది స్మగ్లర్లను అరెస్టు చేసింది. 16 ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు, గొడ్డళ్లు బరిసెలు, రంపపు చుట్టలు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్‌ఎస్‌ఐ మురళీధర్‌రెడ్డి బృందం శుక్రవారం రాత్రి ప్రొద్దుటూరు-జమ్మలమడుగు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టింది. తెల్లవారుజామున పెద్దశెట్టిపల్లి వద్ద రెండు కార్లు వేగంగా వస్తూ కనిపించాయి. పోలీసులను గమనించి వాహనాలు పక్కకు ఆపి దిగిపారిపోయే ప్రయత్నం చేశారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వెంబడించి 18మందిని పట్టుకున్నారు. కార్లు తనిఖీ చేయగా 16 ఎర్రచందనం దుంగలు, నాలుగు పిడిలేని గొడ్డళ్లు, నాలుగు పిడిలేని బరిసెలు, రంపపు చుట్టలు దొరికాయి. స్మగ్లర్లతో పాటు వాటిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

### జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రచయిత, అనువాదకుడు జిల్లేళ్ల బాలాజీకి తమిళ సాహిత్య పురస్కారం ప్రకటించారు. పడైప్పు అనే తమిళ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఈ ఏడాది ప్రకటించిన ఐదు పురస్కారాల్లో ఇలక్కియ చుడర్ పురస్కారం బాలాజీని వరించింది. వివిధ సాహితీ ప్రక్రియల్లో విశేష కృషి చేసే రచయితలకు ఈ అవార్డులను ఇస్తారు. ఈ నెల 27న చెన్నైలో నిర్వహించే సభలో పురస్కారం అందజేస్తారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న జిల్లేళ్ల బాలాజీ 130 కథలు రాశారు. 11 నవలలు, ఒక కవితా సంపుటి ప్రకటించారు. పలు కథలు నవలలు తమిళం నుంచి తెలుగులోకి అనువదించారు.



# పుత్తూరు వార్తలు

## బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా అభియాన్


చెత్త ఊడుస్తున్న నిషిధరాజు, అశోకరాజు తదితరులు

పుత్తూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్డీఎం థియేటర్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు బీజేపీ నాయకులు రోడ్డును శుభ్రపరిచారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి, ఎల్ఐసీ కార్యాలయ పరిసరాల్లో చెత్త తొలగించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధరాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిద్ధార్థ కళాశాలల చైర్మన్ అశోకరాజు, జనార్దన రాజు, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల పరిరక్షణతో కాలుష్యానికి చెక్

పుత్తూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛఆంధ్రలో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్‌చ డిగ్రీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రపరిచారు. మొక్కలు నాటి సంరక్షిస్తే వాతావరణ కాలుష్యం తగ్గి జీవన ప్రమాణాలు పెరుగుతాయని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు కోటేశ్వరయ్య, శ్రీనివాసులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## శ్రీవారి గొడుగుల ఊరేగింపు



పుత్తూరు టౌన్/ నారాయణవనం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నై నుంచి గొడుగులతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు నారాయణవనం, పుత్తూరు పట్టణాల్లో ఘన స్వాగతం పలికారు. ఏటా చెన్నై నుంచి శ్రీవారికి సమర్పించేందుకు పాదయాత్రగా గొడుగులతో తిరుమలకు చేరుకోవడం ఆనవాయితీ. పుత్తూరు పట్టణంలోని ఆర్డీఎం గేటు వద్ద పాదయాత్ర ప్రారంభమై అంబేడ్కర్ సర్కిల్, సుబ్రమణ్యం స్వామి ఆలయం వరకు కొనసాగుతుంది. ఈక్రమంలో గొడుగులకు స్థానికులు భక్తిప్రవత్తులతో కర్పూర హారుతలిచ్చారు. నారాయణవనంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం శ్రీవారి గొడుగులను ఊరేగించారు. కల్యాణ వెంకన్న ఆలయం నుంచి ఊరేగింపు ప్రారంభించి, నగరి వీధి, శ్రీరాములు వారి ఆలయం నుంచి శ్రీ దుండి వినాయకస్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది.

## నిరంతరాయంగా వైద్య సేవలు


ల్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వడమాలపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆదేశించారు. శనివారం వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్, రోగుల సంఖ్యతోపాటు పలు రికార్డులను పనిశీలించారు. ఈకేంద్రంలో 24 గంటలు వైద్య చికిత్సలు తప్పనిసరిగా అందించాలని చెప్పారు. ఆవరణలో మెక్కులు నాటారు. వైద్యాధికారి సందీప్, సీహెచ్ఓ పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా శ్రీవారి గ్రామోత్సవం

### పెరటాసి మొదటి శనివారం ● పోటెత్తిన భక్తజనం




వడమాలపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వ స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. పెరటాశి నెల మొదటి శనివారం కావడంతో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అభయహస్తాధీశుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామికి మొక్కు ఉన్న భక్తులు తలనీలాలు సమర్పించారు. అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో ముడుపులు చెల్లించారు. అంతకుముందు సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలపై అధిష్టింపజేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతీ, అండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని మేళతాళాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. డిప్యూటీ ఈఓ శ్రీవాణి, ఆలయ అధికారి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర సమాజం



వడమాలపేట, సెప్టెం బరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక చెత్త సేకరణ కేంద్రం వద్ద మొక్కులు నాటారు. మెక్కలు నాటుదాం.. అందరూ ఆరోగ్యంగా ఉందాం... చెట్లు ప్రగతికి మెట్లు... అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివరాయల్, ఢిల్లీప్రసాద్, ఈవోఆర్డీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## నగదు స్వాహాపై కేసు నమోదు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సురేష్ ప్రొడక్షన్స్ యాజమాన్యం నిర్వహణలో ఉన్న సినిమా హాళ్లకు సంబంధించిన నగదు స్వాహా చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సురేష్ ప్రొడక్షన్స్‌లో పనిచేసే వెంకటసాయి సినిమా హాళ్లలో కలెక్షన్ నగదు రూ.12 లక్షలను తన సొంత అవసరాలకు వాడుకుని నకిలీ బిల్లులు సమర్పించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆ సంస్థ మేనేజర్ ఫిర్యాదు చేయడంతో వెంకటసాయిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

## ఉన్నత పాఠశాలకు బీరువా వితరణ

కోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాక ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు బీరువాను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగయ్య, వెంకటయ్య కుమార్తె కల్పన తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత సామాజిక బాధ్యత

నాయుడుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాయుడుపేట ఏఎంసీ ప్రాంగణంలో వైస్ చైర్మన్ కిలారి గోపి, డైరెక్టర్లు గిండి సతీష్, కేశవరెడ్డి, గోను బాబు తదితరులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణకుమారి ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో పరిసరాలను శుభ్రం చేశారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భానుశెట్టి, శ్రీను, రోహిణి, సల్మా, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న కల్యాణ్‌రెడ్డి


క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందిస్తున్న కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రిలో చేర్పించి కేఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. శ్రీకాళహస్తి - సూళ్లూరుపేట మార్గంలోని సంత వేలూరు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవ శాత్తు కింద పడి గాయాలపాలయ్యారు. అటువైపు వెళ్తున్న కల్యాణ్‌రెడ్డి క్షతగాత్రుడిని తన కారులో సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి బంధువులకు సమాచారం అందించారు.

## భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాడ వీధుల్లో శనివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. భజన మండలి కళాకారులు గోవిందరాజస్వామి ఆలయం నుంచి ప్రారంభించి మాడవీధుల్లో గోవింద నామాలు స్మరిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరటాసి మాసం తొలి శనివారం కావడంతో కళాకారులు అధిక సంఖ్యలో ఈ సంకీర్తనకు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు గుండా గోపీనాథ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మేకల గుంగయ్య, చెంగారెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, మురళి, సుబ్రహ్మణ్యం, మునిరత్న మాచారి, పద్మావతి, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## బాలోత్సవం వాల్‌పోస్టర్ల అవిష్కరణ


వాల్‌పోస్టర్లను అవిష్కరిస్తున్న బాలోత్సవం నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రోటరీ క్లబ్ సౌజన్యంతో అక్టోబరు 25వ తేదీ నుంచి రెండు రోజులపాటు జరిగే బాలోత్సవం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు మల్లారపు నాగార్జున, గౌరవ అధ్యక్షులు దామోదరం, అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ పిల్లల్లో దాగివున్న సృజనను, ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలనే ఆశయంతో మూడేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తిరుపతి ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంద న్నారు. అకడమిక్ కల్చరల్ విభాగాల్లో 37 అంశాల్లో 75 విభాగాలుగా ఎనిమిది వేదికలపై సబ్ జూనియర్స్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో చిన్నారులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి గురునాథం, ముఖేష్, జేవీవీ రఫి, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్రశెట్టి, మట్టా పురుషోత్తంరెడ్డి, హేమచంద్ర, హెల్పింగ్ టూ ఆర్ట్స్ మణికంఠ, వుయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు తహసున్నీసా, దివ్యాన్గ్ సేవా ట్రస్టు మునిలక్ష్మి, చెస్ బాలాజీ, తైక్వాండో బాలకృష్ణ, ఇంపాక్ట్ శ్రీధర్, విట్టలం చిత్రకారులు డాక్టర్ సాగర్ గిన్న, అర్చన, గాయత్రి పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయానికి రూ.2లక్షల విరాళం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ ఆలయ అభివృద్ధికి శ్రీసాయి సుధా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి రూ.2లక్షల విరాళం ఇచ్చారు. ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్‌కు శనివారం ఈ మొత్తం అందించారు.

## ఇంటి వద్దనే క్యాన్సర్ పరీక్షలు


గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న కూటమి నేతలు

పెళ్లకూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 30 సంవత్సరాలు పైబడిన వారందరికి ఇంటి వద్దనే నోటి, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యులు సుజాతమ్మ, జితేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని చిల్లకూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్, వైద్యులతో కలిసి ప్రారంభించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ పొందిన వైద్య నిపుణులు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తద్వారా క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంతో పాటు అవసరమైన చికిత్స సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శాంతి, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, టీడీపీ నాయకులు సన్నారెడ్డి వేణురెడ్డి, ఏఎన్ఎంలు భూలక్ష్మి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్య సూత్రాలను పాటించి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని టీడీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్, వాకాడు ఏఎంసీ చైర్మన్ దారా ప్రమీలా అన్నారు. శనివారం ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని కోట దళితవాడలో స్వస్థనారి సశక్త్ పరివార్ అభియాన్ పథకంపై మహిళలకు అవగాహన కల్పించారు. స్థానిక వైద్యాధికారి డోన్‌ప్రియా రావు, డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అదే విధంగా కొక్కుపాడులో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జితేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, ఎంపీటీసీ దారా సురేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భాగవత కథల పుస్తకావిష్కరణ

గూడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వరదానగర్‌లోని ఇంద్రసేనమ్మ నివాసంలో శనివారం శ్రీదేవి భాగవత కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయదుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ మాట్లాడుతూ పట్టణానికి చెందిన టీవీఎల్ ప్రసాద్ భాగవత కథలు అందరికీ అర్థమయ్యే రీతిలో సరళతరంగా రచించి ఇంద్రసేనమ్మ సహ కారంతో ప్రచురించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శివకుమార్, డాక్టర్ రోహిణి, ఇంద్రసేనమ్మ, శ్రీకంటి రామమోహన్ రావు, కోడూరు మీరారెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

డక్కిలి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. శనివారం వెలికల్లు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ గడ్డం చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పంపిణీలో తేడాలొస్తే లైసెన్స్ రద్దు


డీలర్లతో మాట్లాడుతున్న ఏవో సుచ్చేంద్ర ప్రసాద్

కోట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా ఎలాంటి లోపాలు జరగకుండా డీలర్లు రైతులకు ఎరువులను సరఫరా చేయాలని, తేడాలొస్తే సంబంధిత దుకాణ లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయ అధికారి సుచ్చేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. కోటలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఎరువుల దుకాణ డీలర్లతో యూరియా పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ రాబోవు సీజన్‌కు సంబంధించి యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉంచాలన్నారు. ఎకరా పొలానికి మూడుబస్తాల యూరియా విడతల వారీగా అందిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి సాయికుమార్, డీలర్లు పాల్గొన్నారు.

## అవగాహనతోనే క్యాన్సర్ నిర్మూలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన ఉంటే దీనిని మొదట్లోనే నిర్మూలించే అవకాశం ఉంటుందని ఈఎస్ఐ ఆస్పత్రి ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు పద్మావతి అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఈఎస్ఐ ఆస్పత్రిలో ఎంఎస్ శ్యాంబాబు ఆధ్వర్యంలో శనివారం గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ అంటే ఏమిటి దాని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే విషయాలపై ఆమె ఆస్పత్రిలోని మహిళా సిబ్బందికి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ నోడల్ అధికారి పద్మహస్త, ఆర్ఎంవో ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్లు చందన, మృణాళిని, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సరళీకృత విద్యాబోధనకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కోట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధించా ల్సిన సరళీకృత విద్యపై దసరా సెల వుల్లో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డీవైఈవో సనత్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. ఆయా సమావేశాలను సనత్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యాబోధన, సంతృప్తికర ఫలితాలు సాధించి నియోజకవర్గంలోని పాఠశాలలను మొదటి స్థానంలో ఉంచాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## డీఎస్పీకి సన్మానం

నాయుడుపేట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ డీఎస్పీ బీవీ శ్రీనివాసులును తిరుపతి పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా సన్మానించారు. శనివారం డీఎస్పీ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ అరుణ్, టీడీపీ నాయకులు భరణి, సుధాకర్, చంద్రశేఖర్, సుధీర్ పాల్గొన్నారు.


విద్యుత్ దీపకాంతుల్లో చెంగాళమ్మ ఆలయం

## దేవి నవరాత్రి ఉత్సవాలకు చెంగాళమ్మ ఆలయం ముస్తాబు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చెంగాళమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో అలంకరించారు. 11 రోజులు అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## మినీలారీ ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని మూర్తిరెడ్డిపాళెం వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌ను మినీలారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నాయుడుపేట పట్టణానికి చెందిన లక్ష్మణ్(35) ఓ ట్రాక్టర్ షోరూంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం మోటారు సైకిల్‌పై మండలంలోని ఓ గ్రామానికి వెళ్లి వస్తుండగా మూర్తిరెడ్డిపాళెం వద్ద మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బీజేపీ నేత వాకాటి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ

తడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగ్రామం చేనిగుంటలో శనివారం నిర్వహించారు. వాకాటి నారాయణరెడ్డి తల్లి చేనిగుంట సర్పంచ్ వాకాటి బుజ్జమ్మ చేతులమీదుగా కేక్‌ను కట్‌చేసి పంచిపెట్టారు. అలాగే రామాపురం సచివాలయం వద్ద సర్పంచ్ టీకే శ్రీనివాసన్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సెల్వం, టీడీపీ నాయకులు టీకే శ్రీనివాసన్, రవి, కళానిధి. గుణసుందరి, రామమూర్తి, వేనాటి గిరిరెడ్డి, కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి రాచర్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో ఆరోగ్యం


ధ్యాన మహాయజ్ఞంలో సందేశాన్ని వినిపిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ వీరరాఘవరావు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ఆరోగ్యం సిద్ధిస్తుందని పలువురు వ్యక్తులు తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరుగుతున్న ధ్యాన మహాయజ్ఞంలో భాగంగా ఐదో రోజైన శనివారం సీనియర్ పిరమిడ్ మాస్టర్ తలర్తి వీరరాఘవరావు, ప్రేమ్‌నాధ్, హైదరాబాదుకు చెందిన ది పిరమిడ్ స్పిరుచ్యువల్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ జ్ఞాని దుఃఖంలోనూ ఆనందంగా ఉంటారని తెలిపారు. అనంతరం నాయుడుపేటకు చెందిన ఆర్.వర్షిని నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతపురం జిల్లాకు చెందిన ఆదిలక్ష్మీ బృందం సంగీత ప్రదర్శన అలరించింది. యూనివర్సల్ సింగర్స్ రామాంజనేయులు, పద్మావతిలు ఆధ్యాత్మిక గీతాలను ఆలపించి మైమరపించారు. అంతకు ముందు మూడు గంటల పాటు అఖండ సామూ హిక మౌన ధ్యాన సాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎం తిరుపతి జిల్లా అధ్యక్షులు కంచి రఘురాం, ధ్యాన మహాయజ్ఞం చైర్మన్ సంగీతబాబు, సభ్యులు హనుమంతరావు, సేత్ బాలకృష్ణ, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

గూడూరు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింగ రావుపేటలోని సిద్ధార్థ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్‌రెడ్డి, తలమంచి సిద్దారెడ్డి, డాక్టర్లు యామిని, లక్ష్మీసుధ, జినిత్‌రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.





## పెరటాసి.. అలిపిరి కిక్కిరిసి

### అలిపిరి పాదాల మండపం వద్ద పోటెత్తిన భక్తజం

### పిండి దీపాలు వెలిగించి మొక్కులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద పెరటాసి మాసం తొలి శనివారం పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. వెంకటేశ్వరస్వామి ఆరాధనకు ఈ మాసం శ్రేష్ఠమైనదిగా భావిస్తారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పిండి దీపాలను వెలిగించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండపంలోని వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు అలిపిరి మండపం వద్దకు వచ్చి పూజలు చేస్తున్నారు. సాయంత్రానికి భక్తులు సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. నడక మార్గంలో తిరుమలకు వెళ్తున్న భక్తులు ఓ వైపు.. పూజలు చేయడానికి వచ్చిన స్థానిక భక్తులు మరో వైపు ఇలా పాదాల మండపం ప్రాంతం కిక్కిరిసిపోయింది. గోవింద నామస్మరణలతో మార్మోగింది.

## 1న దక్షిణ కాళికాదేవి ఆలయ కుంభాభిషేకం


ఆలయం వద్ద జోరుగా ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి ఆలయం కుంభాభిషేక మహోత్స వానికి సిద్ధమైంది. ఇటీవల ఆలయాన్ని దాతలు, గ్రామస్థుల సాయంతో పునర్నిర్మించారు. అక్టోబరు 1న సుప్రభాతం, వేద పారాయణం, నవగ్రహ దిక్పాలక అష్టమా తృక, యోగిని దేవతల పూజా హోమం, చండీ హోమం, రుద్రహోమం, 108 కలశాలకు మహా కుంభాభిషేకానికి పూజ, నైవేద్య సమర్ప ణ, మంత్రపుష్పం, తీర్థప్రసాద విని యోగం జర గనుంది. 2వ తేదీ సుప్రభాతం, వేద పారాయణం, నిత్య విధులు, సర్వదేవతా హోమాలు, చండీహోమం, రుద్ర హోమం, దక్షిణ కాళి, మహాకాళి హోమాలు, మహాపూర్ణాహుతి, 108 కలశసహిత మహా కుంభాభిషేకం, దక్షిణ కాళికాదేవత అర్చన, మహానైవేద్య సహిత నీ రాజనం, మంత్రపుష్పం, తీర్థవినియోగం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## రేపటినుంచి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా ఉత్సవాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి దసరా మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి ఉత్సవమూర్తి రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 22న తిరువారూర్ త్యాగరాజస్వామి, కబలాంబిక అలంకారం, 23న గర్భరక్షాంబికా దేవి అలంకారం, 24న తెన్నాంగూర్ పాండురంగ విఠల్, రుక్మిణిదేవి అలంకారం, 25న మన్నార్‌గుడి రాజగోపాలస్వామి అలంకారం, 26న గాయత్రిదేవి అలంకారం, 27న ప్రహ్లాద నరసింహస్వామి అలంకారం, 28న కళ్ళళగర్ పెరుమాళ్‌స్వామి అలంకారం, 29న సరస్వతిదేవి అలంకారం, 30న ఇంద్రాణి అలంకారం, అక్టోబరు 1న నిత్యసుమంగళి అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరి దర్శనమివ్వనున్నారు.

## శ్రీకాళహస్తి - నెల్లూరు ఆర్టీసీ బస్సుల వేళలు మార్చండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి- నెల్లూరు వైపు వెళ్లే బస్సు వేళలను మార్చాలని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు శ్రీకాళహస్తి డిపో మేనేజరుకు వినతి చేశారు. గతంలో ఉదయం 7.15 పాయింట్‌కు చేరుకుని 7.30గంటలకు బయలుదేరేదన్నారు. దీంతో రద్దీ ఉండేదన్నారు. రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు, భక్తులతో అనుకూలంగా ఉండేదన్నారు. అయితే ఇటీవల కొద్ది నెలలుగా 7.50గంటలకు స్టాండ్‌లోకి చేరుకుని 8గంటలకు బయలుదేరుతోందన్నారు.దీంతో నాయుడుపేట, గూడూరు నుంచి రైళ్లకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉదయం 7గంటలకు నెల్లూరు వైపు వెళ్లే ఫైర్ బస్సు రద్దు కావడంతో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయని చెప్పారు. పలుమార్లు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉదయం 7.30గంటలకు బస్సు బయలుదేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సమస్యలను పరిష్కరించండి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపింది. పెండింగ్ సమస్యల పరిష్కారానికి గతంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టగా హామీ ఇచ్చారే తప్ప పరిష్కరించలేదన్నారు. దీనిపై 22న కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతామన్నారు. అనంతరం ఆర్డీవో భాను ప్రకాశ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరస్వామికి శనివారాన్ని పురస్కరించుకుని తైలాభిషేకాన్ని వేదోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## ముక్కంటి సేవలో ప్రముఖులు


దర్శనానంతరం కుటుంబీకులతో కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసంత్ బాలాజి - అమృతానంద దేవ్‌కు ముక్కంటి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బసంత్ బాలాజి కుటుంబ సమేతంగా, జమ్ము కశ్మీర్ శారదా సర్వజ్ఞ పీఠం పీఠాధిపతి జగద్గురు అనంత్ శ్రీ స్వామి అమృతానంద దేవ్ తీర్థ్‌జీ మహారాజ్ తన శిష్యబృందంతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## అవార్డు గ్రహీతలకు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం, వరదయ్యపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లతకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందజేసింది. ఈ సందర్భంగా వారిని శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యార్థులు ఘనంగా సత్కరించారు. శివ, విజయ్‌కుమార్, ప్రదీప్, హరీష్, నాగేశు, రాజశేఖర్, బాల, ప్రసాద్‌స్వామి, మధు, యాసిన్, శ్రీవాత్సవ్, శ్రీధర్, వెంకటకృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం


మొక్క నాటుతున్న జనసైనికులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కళాశాలను పరిశుభ్రంగా ఉంచుదామని ప్రిన్సిపాల్ నాగరాజునాయుడు అన్నారు. పట్టణంలోని ఎస్సీయే ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర లో భాగంగా గ్రీన్ ఏపీ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేసి మొక్కలను నాటారు. అధ్యాపకులు సుధీర్, సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- మొక్కలను పెంచి పర్యావరణాన్ని సంరక్షిద్దామని జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి అన్నారు. మన పర్యావరణం, మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీ సచివాలయం వద్ద మొక్కలను నాటారు. ప్రదీప్‌కుమార్, లక్ష్మణ్, దినేష్, శ్రీను, నవీన్, మణి, వెంకటేష్, మునిచంద్ర, భానుప్రకాష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

**కేవీబీపురం(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ సౌజన్య, ప్రధానోపాధ్యాయులు సురేష్ ఆధ్వర్యంలో మోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలోని చెత్తను తొలగించి పూలమొక్కలను, నీడనిచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యా వరణాన్ని రక్షించడానికి ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటాలన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి):** ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ శ్రీదేవి పిలుపునిచ్చారు. బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం, అనర్థాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ఏపీఎం దేవరి, ప్రధానోధ్యాయులు రమణయ్య, ఈవోపీర్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ జయంతి

రేణిగుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను శనివారం ముందస్తుగా నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గురజాడ జీవిత చరిత్రను వివరించారు. విద్యా వికాస వేదిక కన్వీనర్ వెంకరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏడుకొండలవాడి సొమ్ముకే ఎసరు!


సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'వేంకటేశ్వరా ఇదేం పాపం... నీ సొమ్ముకే జగన్ గ్యాంగ్ ఎసరు పెట్టారు' అంటూ టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు మండిపడ్డారు. శనివారం టీడీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి అండదండలతో పరకామణిలో దొంగలు పాగా వేసి కోట్ల సొత్తు కొల్లగొట్టారని ఆరోపించారు. ఈ సొమ్మును రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి వాటాలను తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు అందాయని నిందితులే చెబుతున్నారన్నారు. భక్తులు నమ్మకంతో వేసిన ముడుపులు, కానుకలను రవికుమార్ అనే వ్యక్తి చోరీ చేసినప్పుడు లోక్ అదాలత్ ద్వారా భూమన కరుణాకర రెడ్డి రాజీ చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్ గ్యాంగ్ అండదండలతో శ్రీవారికి చేయని అపరాచం లేదన్నారు. పరకామణి వీడియోలు ఈ రోజు బయట పడ్డాయని, నిందుతులే వైసీపీ పాపాల చిట్టా విప్పబోతున్నారని తెలిపారు. దీనిపై జ్యుడిషియల్ విచారణచేసి దొంగలను కఠినంగా శిక్షించి భక్తుల మనోభావాలను కాపాడాలని కోరారు. మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తంగేళ్లపాళెం పీఏసీఎస్ ఛైర్మన్ భాస్కర్, నాయకులు మునిరాజా యాదవ్, వజ్రం కిషోర్, సంజాకుల మురళీకృష్ణ, కృష్ణమూర్తి, మురళీనాయుడు, మణి, శివ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, సెప్టెంబర్ 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోన కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెరటాసి నెల మొదటి శనివారం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి భక్తులు గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి సూచించారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం, శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని పురపాలకసంఘ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి బేబీరాణి మాట్లాడుతూ... భద్రత, ఉచిత న్యాయసేవా చట్టం, వరకట్న నిరోధక చట్టం, బాల్య వివాహ నిర్మూలన చట్టాలపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే ఉచితంగా న్యాయసేవ అందిస్తారని తెలిపారు. అదే విధంగా టోల్‌ఫ్రీ నెం.15100ను ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, మున్సిపల్ కమిషనర్, 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

### స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తో
## మహిళల ఆరోగ్యానికి భరోసా

సత్యవేడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తో మహిళల ఆరోగ్యానికి భరోసా అని సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యాధికారి సుహైల్ అన్నారు. వైద్యాధికారి హర్షవర్ధన్‌తో కలిసి మహిళలకు హిమోగ్లోబిన్, షుగర్, బీపీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. నోటి, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు రెహానా, చంద్రన్, మానస, ప్రేమ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు హేమభూషణం, దనేష్, బీజేపీ నాయకులు ఎస్.బాలాజి, శ్రీకాంత్, నరేంద్ర, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ద్వైత ఆధ్వర్యంలో వరదయ్యపాళెం పంచాయతీ కార్యలయ ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని నిర్వహించారు. ఈవో బసిరెడ్డి, డీవీఎంసీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, కూటమి నాయకులు సిద్దులయ్య, మునిభూషణమ్మ, మోహన్, సిద్దులయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల విక్రయాల్లో
## అక్రమాలకు పాల్పడితే చర్యలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడే దుకాణదారులపై చర్యలు తప్పవని సత్యవేడు డివిజన్ ఏడీఏ సుబ్రమణ్యం హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఏవో గౌరి ఆధ్వర్యంలో మండలంలోని ఎరువుల దుకాణదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నందున అవసరం మేరకు యూరియా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా అవసరమైన రైతులకు వారి పాస్‌బుక్, ఆధార్ నెంబర్ జిరాక్స్ కాపీలతో పాటూ వారి ఫోన్ నెంబర్ తీసుకుని ఈపాస్ మెషిన్, బిల్‌బుక్‌లో తప్పనిసరిగా రికార్డు నమోదు చేయాలన్నారు. యూరియాను ఇతర జిల్లాల రైతులకు విక్రయించరాదన్నారు. ఎరువుల కొనుగోలు, అమ్మకం వివరాలకు సంబంధించిన డైలీ రిపోర్ట్‌ను విధిగా ఏవోకు అందించాలన్నారు.

## అర్థమయ్యేలా బోధించండి

ఏర్పేడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభపద్ధతిలో విద్యను బోధించాలని అల్పా అసిస్టెంట్ కోఆర్డినేటర్ మీనాక్షి సూచించారు. ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన సీఆర్సీలో ఆమె పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించారు. ప్రతినెలా జరిగే సీఆర్సీ సమావేశంలో ఉపాధ్యాయులు శిక్షణ పొంది వాటిని విద్యార్థులకు నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దయాకర్, స్టేట్ రిసోర్స్ పర్సన్ సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పంట కాలువ ఆక్రమణల తొలగింపు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిగిల కండ్రిగలోని అరుంధతీయవాడ మీదుగా సాగే పంట కాలువ ఆక్రమణలను తొలగించారు. అరుంధతీయవాడ వద్ద పంట కాలువ ఆక్రమణలకు గురికావడంతో కాలువ నుంచి వచ్చే నీరు ఇళ్ల మధ్య చేరుతోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. దీనిపై ఇటీవల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆక్రమణలు తొలగించాలని తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో ఈశ్వరయ్య, సచివాలయ సిబ్బంది శనివారం ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. సర్పంచ్ కృష్ణయ్య పాల్గొన్నారు.

## దాడి కేసులో ఒకరి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆటోలో వెళుతున్న కార్మికులపై దాడికి పాల్పడిన కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ మురళినాయుడు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు... జూలై 15వ తేదీ రాత్రి 10 గంటలకు కొంతమంది కార్మికులు పని ముగించుకుని శ్రీసిటీ నుంచి ఆటోలో వెళ్తుతుండగా బజారు వీధిలో సత్యవేడు దళితవాడకు చెందిన సీమాన్ రోడ్డుకు అడ్డంగా బైక్ నిలిపి అల్లరి చేష్టలకు పాల్పడ్డాడు. బైక్‌ను పక్కకు తీయాలని కోరిన ఆటోలోని వ్యక్తులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆటోలో ఉన్న వారికి, సీమాన్ మధ్య తోపులాట జరిగింది. కోపోద్రిక్తుడైన సీమాన్ తన అనుచరులతో కలిసి ఎస్బీఐ వద్ద ఆటోను అడ్డగించి కట్టెలతో దాడి చేశారు. స్థానికుల జోక్యం చేసుకుని వారిని రక్షించారు. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామస్వామి సీమాన్ అతని అన్న లారెన్స్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీంతో నిందితులు పరారయ్యారు. శనివారం మధ్యాహ్నం సీమాన్ సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సంచరిస్తుండగా అదుపులో తీసుకున్నారు. లారెన్స్ పరారీలోనే ఉన్నాడు. కాగా నిందితులపై సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి.

## విద్యుత్ స్తంభం తొలగింపు



రేణిగుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రోడ్డుపై అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. ఈ స్తంభం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని ఫిర్యాదులు అందాయి. దీంతో ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి పోలీసుల సహకారంతో స్తంభాన్ని అక్కడి నుంచి తొలగించారు. ఈ కార్యక్రమంలో సీఐ జయచంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు పుష్పానందం, కణ్ణన్‌రెడ్డి, కొరియర్ రవి, నవాబ్, జగదీష్, దినేష్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు


డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ

రేణిగుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులు, భక్తుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ జయచంద్ర హెచ్చరించారు. రైల్వే స్టేషన్ ఆవరణలోని ఆటో, జీప్ స్టాండ్ డ్రైవర్లతో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ... శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేశ నలుమూలల నుంచి భక్తులు, యాత్రికులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. రద్దీ సందర్భంగా వారి నుంచి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేసినట్లు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భక్తులు, యాత్రికులు, ప్రయాణికుల పట్ల గౌరవంగా మెలగాలని సూచించారు. అలాగే రోడ్డుపై ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దింపే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రేణిగుంట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రవీచంద్ర అన్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశం, ఈవోపీఆర్డీ ప్రభురావు, కార్యదర్శి మాధవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.